నవతెలంగాణ
మెదక్
గురువారం | 20 మార్చి 2025 | www.navatelangana.com

డంపింగ్‌యార్డ్‌ను నిరసిస్తూ కేంద్ర మంత్రిని కలిసిన జేఏసీ నాయకులు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని గుమ్మడిదల రైతు జేఏసీ నాయకులు ఢిల్లీలో కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌ను మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఏ.మురళీధర్ యాదవ్‌తో కలిసి బుధవారం కలిశారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా వినతిపత్రం అందజేశారు. ప్యారానగర్ డంపింగ్ యార్డ్ వల్ల కలిగే నష్టాల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. నిజానికి డంపింగ్ యాడ్ ఏర్పాటు చేస్తున్న స్థలం అటవిశాఖదే అన్నారు. అడవికి చెందిన భూమిలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తారని తెలిపారు. చట్ట ప్రకారం గ్రామాల్లో ప్రజాభిప్రాయం సేకరణ తీసుకోకుండా చట్టానికి విరుద్ధంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్నారని.. వెంటనే డంపింగ్‌యార్డ్ నిర్మాణాలను నిలిపివేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, సదానందరెడ్డి, ఉదయ్‌కుమార్ జోగినాథ్ గుప్తా, మద్దుల బాల్ రెడ్డిలు కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.





ఆశలు తీర్చని అంకెల పద్దు

- ఆదాయం లాక్కోవడం తప్ప...అవసరాలు తీర్చని వైనం
- కనీస వేతనాల పెంపు ప్రస్తావనేది..
- నిరాశలో స్కీం వర్కర్లు, కార్మికులు
- సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వని సర్కార్
- సంగారెడ్డికి మెట్రో ఇప్పట్లో లేనట్లేనా
- సంక్షేమ శాఖలకు అంకెల్లో బేష్...ఆచరణ తుస్
- ఆరు గ్యారంటీల అమలుకు నిధులేవి:సీపీఐ(ఎం)
- నిరాశ పర్చిన రాష్ట్ర బడ్జెట్:బీఆర్ఎస్
- మేడిపండులాంటి బడ్జెట్:బీజేపీ
- అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట:కాంగ్రెస్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన అంకెల పద్దు బడ్జెట్ ప్రజల ఆశలు తీర్చేలా లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఆరు గ్యారంటీల అమలకు సరిపడ నిధులివ్వలేదని, సంక్షేమ శాఖలకు అంకెల్లో చూపుడు తప్ప ఆచరణలో ఖర్చు చేయట్లేదని విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. లక్షలాది మంది కార్మికులు, స్కీం వర్కర్ల కనీస వేతన పెంపు ప్రస్తావనలేదు. వ్యవసాయానికి నిధుల్లో కోత పెట్టడంతో ఆ రంగంలో కోతలు పెట్టే ప్రమాదముంది. సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వలేదు. మెట్రో విస్తరణ ప్రస్తావ-నలేదు. ఉమ్మడి మెదక్ జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడేలా నిధుల్లేకపోవడంతో సీపీఐ(ఎం), బీఆర్ఎస్, బీజేపీ వంటి విపక్ష పార్టీలే కాదు సామాజిక, ప్రజా సంఘాలు సైతం బడ్జెట్ కేటాయింపులపై మండిపడుతున్నాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసన సభలో ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్ల అంచనా బడ్జెట్‌ను వివిద శాఖలు, రంగాలకు చేసిన కేటాయింపుల్ని చదివి వివరించారు. ఇచ్చిన హామీల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం సమపాలల్లో నిధుల్ని కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. నిధుల కేటాయింపుల్ని పరిశీలిస్తే... ఉమ్మడి మెదక్ జిల్లాకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. మూడు జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వలేదు. సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ ప్రస్తావన చేయలేదు. సమీకృత భవనాలు, మెడికల్ కళాశాల భవనాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధికి అరకొర నిధులే విదిల్చారు. సింగూరుకు రూ.44.85 కోట్లు తప్ప మంజీర పరిరక్షణ కోసం నక్కవాగు ప్రక్షాళన, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, సంగారెడ్డి ప్రాంతాలకు సాగునీరిచ్చే బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతలకు పైసా కేటాయించలేదు. గౌరవెల్లి, ఇతర పంట కాల్వలకూ నిధుల్లేవు.

కార్మికులు, స్కీం వర్కర్లను విస్మరించిన బడ్జెట్

పారిశ్రామిక రంగంగా విస్తరించిన ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షలాది మంది కార్మికులున్నారు. లక్షలాది మంది కార్మికులు, వేలాది మంది స్కీం వర్కర్లు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని పోరాడినా సర్కార్ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం న మ కూర్చ డ ం లో పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లా ముఖ్యమైనవిగా ఉన్నాయి. పర్ క్యాపిటా ఇన్‌కంలో, జీడీడీపీ ర్యాంకింగ్‌లో మూడు జిల్లాలు మెరుగ్గా ఉన్నాయి. రెవెన్యూ జనరేటెడ్ ఫ్రం మినరల్ రిసోర్స్‌సెస్‌లోనూ బాగున్నాయని బడ్జెట్‌లో ప్రస్తావించారు. మ్యానిఫ్యాక్షరింగ్ రంగంలోనూ గ్రోత్ ఉందన్నారు. అయితే ఆ సంపదను సృష్టించడంలో కార్మికుల శ్రమే కీలకమైంది. అలాంటి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు పెంచడానికి బడ్జెట్‌లో ఏలాంటి కేటాయింపుల్లేవు. కార్మిక, ఉపాధి కల్పన కోసం కేవలం రూ.900 కోట్లే కేటాయించారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల్ని లబ్ధిదారులకు అందించే సేవలో ఉన్న అంగన్వాడీలు, ఆశాలు సైతం జీతాల కోసం కొట్లాడారు. పంచాయతీ, మున్సిపాలిటీ, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, సదుపాయాల మెరుగుదలకు ఏలాంటి కేటాయింపులు చేయలేదు.

సంక్షేమ శాఖలకు అంకెల్లోనే...

బడ్జెట్‌లో అత్యధికంగా ఎస్సీ సంక్షేమానికి రూ.40,234 కోట్లు, ఎస్టీలకు రూ.17169, బీసీలకు రూ.11405, మైనార్టీలకు రూ.3491 కోట్లు కేటాయించారు. అయితే గత ఆరేళ్లుగా సంక్షేమ శాఖలకు నిధుల్లేక సామాజిక వర్గాలకు పైసా సాయం అందలేదు. చేవెళ్లలో చేసిన డిక్లరేషన్ అంబేద్కర్ అభయహస్తం అటకెక్కించారు. రూ.750 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు బలమైన సంఖ్యలో ఉన్నా వారి జనాభాకు సరిపడ నిధుల్ని బడ్జెట్‌లో పెట్టలేదు. అంకెల్లో చూపిన నిధుల్ని ఆచరణలో ఖర్చు చేయట్లేదని సామాజిక సంఘాలు పేర్కొంటున్నాయి. నిర్ణీత సమయంలో కేటాయింపుల్ని ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

దామోదర రాజనర్సింహా, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి



ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడే విధంగా బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీత వేశాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం. ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా, మహాలక్ష్మీ ఉచిత ప్రయాణం, వరి బోనస్ యువ వికాసం వంటి పథకాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాం. ప్రజల బడ్జెట్‌గా ఉంది. సింగూర్ ప్రాజెక్టుకు రూ.44.85 కోట్లు ఇచ్చాం. సిద్దిపేట జిలాల్లోని వర్గల్‌లో రెండు పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.300 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. రోడ్లు, రహదారులు, భవనాలు, విద్య, వైద్య రంగాల్లో మౌళిక సదుపాయాల కోసం అధిక కేటాయింపులు జరిగాయి.

నిరాశ పర్చిన రాష్ట్ర బడ్జెట్

చింత ప్రభాకర్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు



రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశపర్చింది. ఓట్లేసిన ప్రజల్ని కాంగ్రెస్ విస్మరించింది. మహిళలకు రూ.2500 మహాలక్ష్మీకి నిధులివ్వలేదు కానీ..! అందాల పోటీకి రూ.250 కోట్లు ఇచ్చారు. వ్యవసాయ కూలీలకు నిధులివ్వలేదు. రైతులకు ఇచ్చిన హామీలకు రూ.42 వేల కోట్లు అవసముండగా ఈ సారి వ్యవసాయ రంగానికి నిధులు కోత పెట్టారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేవలం రూ.36 వేల కోట్లే కేటాయించారు. సంక్షేమానికి కూడా కొసరు నిధులే ఇచ్చారు. సంగారెడ్డి జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర ప్రస్తావనలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారు. కొత్త పరిశ్రమల విస్తరణ, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి నిధులు పెంచలేదు. ఈ బడ్జెట్ మహిళలు, వృద్ధులు, రైతులు, నిరుద్యోగుల తీవ్ర నిరాశకు గురి చేసింది.

మెట్రో విస్తరణ పట్టని సర్కార్

గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి



మియాపూర్-సంగారెడ్డి వరకు మెట్రో విస్తరించాలని సీపీఐ(ఎం) అనేక రూపాల్లో పోరాటం చేశాం. గత ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రోను విస్తరిస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇంకాస్త పెంచుతూ సంగారెడ్డి వరకు మెట్రోను నడుపుతామని చెప్పింది. పారిశ్రామికంగా విద్య వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి, మెదక్ జిల్లాకు మెట్రో రవాణా వ్యవస్థ ఎంతో అవసరముంది. ఆ ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించలేదు. లక్షలాది మంది కార్మికులు పారిశ్రామిక ప్రగతిలో ఉన్నారు. వారంతా కనీస వేతనాలకు నోచుకోవట్లేదు. బడ్జెట్‌లో రూ.26 వేల కనీస వేతనం పెంచాలని పోరాడిన కార్మికుల్ని విస్మరించారు. స్కీం వర్కర్లుగా ఉన్న అంగన్వాడీలు, ఆశాలకు వేతనాలు పెంచలేదు. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులకు రూ.4 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా పైసా కేటాయించలేదు. ఆరు గ్యారంటీల అమలు కోసం అరకొర నిధులు ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, పారిశ్రామిక ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం, మున్సిపాలిటీలు, పంచాయతీల అభివృద్ధికి అదనపు కేటాయింపుల్లేవు. కొన్నింటికి అంకెల్లో నిధులు చూపినా అవన్నీ ఖర్చు చేయని పరిస్థితే ఉంటుంది.

అంకెల గారడీ తప్ప ఆరు గ్యారంటీల ఊసేది

గోదారి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు



కాంగ్రెస్ బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఆరు గ్యారంటీల అమలుకు సరిపడ నిధుల కేటాయింపుల్లేవు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఎలాంటి నిధులివ్వలేదు. ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. బడ్జెట్ చూసిన తర్వాత కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని తేలింది. ప్రజా వంచన పాలనగా ఉంది. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేదు. ఇందిరమ్మ ఇళ్లకూ అరకొరే నిధులిచ్చారు. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్బాలున్నాయి.

రావి ఆకుపై సునీత విలియమ్స్ చిత్రం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

సునీత విలియమ్స్ అంతరిక్షంలో 9 నెలలు గడిపి బుధవారం తెల్లవారుజామున భూమి మీదకు వచ్చిన విషయం విధితమే. అయితే స్థానిక లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ బుధవారం రోజున రావి ఆకుపై సునీత విలియమ్స్ చిత్రపటాన్ని గీసి.. ఆమెకు స్వాగతం పలికారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి




నవతెలంగాణ-రాయికోడ్

పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ అంజయ్య సూచించారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రాథమి క పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్ తన సొంత డబ్బులతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. నేడు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖైరతాలి, రజిని, ప్రతిభ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్య ఏర్పాట్లు


నవతెలంగాణ-ఐడీఏబొల్లారం : రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బొల్లారం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో బుధవారం పారిశుధ్య ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్ : మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన బేగరి భూమయ్య కూతురి వివాహం నారాయణఖేడ్ మండలంలోని నమిల్లిమిట్ గ్రామంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్లు, దత్తు, కిరణ్, భూమేష్, సల్మాన్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెందిన గరుగుల భాను (18) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి ఇంటివద్దనే ఉంటున్నాడు. దాంతో చదువుకొమ్మంటే చదువుకోలేదు, పనికి వెళ్లడం లేదు అని అతని తల్లి తండ్రులు మందలించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు క్రిందికి దించి భానును దుబ్బాక ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను చనిపోయినాడని వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి గరుగుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని వివిధ చర్చిలకు మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయల విలువైన చెక్కులను బుధవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చి ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల మూలంగా చెక్కుల పంపిణీ ఆలస్యం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరైన ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రంగారావు, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆయా చర్చిల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.5.50 లక్షల ఆల్ప్రోజోలం, డైజోఫాం పట్టివేత

ఇద్దరు వ్యక్తుల అరెస్టు
మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-సంగారెడ్డి



మహారాష్ట్ర సోలాపూర్ ప్రాంతాల నుంచి ఇద్దరు వ్యక్తులు నిషేధిత మత్తు పదార్థాలను తీసుకవస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.5.50 లక్షల విలువ చేసే ఆల్ప్రోజోలం, డైజోఫామ్ ను పట్టుకున్నారు. మెదక్‌కు చెందిన బి.రాజాగౌడ్, సిద్దిపేటకు చెందిన ఎస్.నర్సాగౌడ్ కలిసి మహారాష్ట్ర సోలార్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న 503 గ్రాముల ఆల్ప్రోజోలం, 17 గ్రాముల డైజో ఫామ్ ను సంగారెడ్డి దౌవులాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నుంచి తీసుక వెలు తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులను, వారి వద్ద ఉన్న మూడు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆల్ప్రోజోలంను పట్టుకున్న టీమ్‌లో ఏఈఎస్ శ్రీనివాసరావు, సీఐలు పి. వీణారెడ్డి, సిహెచ్. చంద్రాశేఖర్, బి.గాంధి కుమార్,ఎస్సై బి. యాదయ్య, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, ఖరీం, సతీష్ మోహన్‌లు ఉన్నారు. ఆల్ప్రోజోలంను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, మెదక్ డిప్యూటి కమిషనర్ హరికిషన్, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

'సింగూర్' నీరు లేక.. ఎండిన పంటలు

36

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేలు నష్టపరిహారమివ్వాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు
ఎండిపోయిన పంట పొలాల సందర్శన

నవతెలంగాణ-జోగిపేట



సింగూర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువకు నీళ్ల విడుదల చేయకపోవడంతో పంట పొలాలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందోల్ మండలంలోని కోడేకల్ గ్రామ శివారులో సింగూర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ పరివాహ పంటపొలాలను పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్, పార్టీ ఏరియా కార్యదర్శి డి.విద్యాసాగర్, నాయకుల బృందం, రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువకు నీళ్ల వదలకపోవడంతో పంట పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. జూన్, జూలైలోనే కాల్వ పనులు ప్రారంభిస్తామని.. నీళ్ల విడుదల చేయమని రైతులకు చెప్పి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. ఇది పూర్తిగా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే అన్నారు. వందల ఎకరాలలో పంటలు ఎండిపోయాయన్నారు ఎండిపోయిన పంటలు అంచనా వేయడానికి అధికారులు సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40,000 ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. అనంతరం మానిక్ మాట్లాడుతూ.. ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంతోనే రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలువలోకి సింగూర్ నీళ్ల విడుదల చేయక పోవడంతో గ్రౌండ్ వాటర్ పూర్తిగా అడుగంటాయన్నారు. బోర్లలో నీళ్ల లేకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. సింగూర్ ఎడమ కాలువ రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు మనోధైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, పార్టీ నాయకులు మహేష్, రైతులు యాదగౌడ్, నాగ గౌడ్, మల్లేశం, ప్రతాపరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లోనే ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు

ఆశా వర్కర్ల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

నవతెలంగాణ-సంగారెడ్డి

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని, వారిని పర్మినెంట్ చేయాలని.. అలోపు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న న్నారు. అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని.. ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పర్చిందన్నారు. ఆశాల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ ఆశాల సమస్యలు మాత్రం నేటికీ పరిష్క రించలేదని మండిపడ్డారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 నిర్ణయిం చి.. ఇతర సమస్యలు పరిష్కరంచాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఆశాలు అనేకసార్లు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేశామన్నారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి నాయకులు బాబు రావు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వరలక్ష్మి, యశోద, నాయకులు శశికళ, ప్రశాంతి, గంగా, సంగీత, తుల్జమ్మ లక్ష్మీనరసింహ, ఎలీషా, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీతో క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతుంది

నవతెలంగాణ-పటాన్‌చెరు



నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) అంటే కేవలం శిబిరాలు, పతకాల కంటే ఎక్కువని, ఇది క్రమశిక్షణ, పట్టుదల, గౌరవం యొక్క విలువ లను పెంపొందిస్తుందని 'సీ' సర్టిఫికెట్ గ్రహీతలైన సీనియర్లు అభిప్రా యపడ్డారు. మూడేళ్ల ఎన్ సీసీ శిక్షణ పూర్తిచేసుకుని 'సీ' సర్టిఫికెట్లు సాధించిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ విద్యార్థులకు జూనియర్లు బుధవారం చిరస్మరణీయమైన వీడ్కోలు సమావేశం ఏర్పా టు చేశారు. సీనియర్ల అంకితభావం, విజయాలను మననం చేసుకుని, వారిని సగౌరవంగా సాగనంపడానికి దీనిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, భావోద్వేగ ప్రసంగాలు, ప్రియమైన జ్ఞాపకాలను నిక్షిప్తంచేసి ప్రదర్శించిన వీడియో అందరినీ ఆకట్టుకున్నాయి. 'ఇది వీడ్కోలు కాదు. మీరు చేసిన అద్భుతమైన ప్రయాణాన్ని గుర్తుచేస్తుంది. విజయం ఎల్లప్పుడూ మిమ్మల్ని అనుసరిస్తుంది, మీ వారసత్వం మాకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది' అనే సందేశంతో ఆ వీడియో ప్రదర్శన ముగిసిం ది. గీతంలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం బయటకు వెళ్లే క్యాడెట్లకు మధుర జ్ఞాపకంగా నిలిచి పోయింది. ఇది కేవలం శిబిరాలు, పతకాల కంటే క్రమశిక్షణ, పట్టుదల, గౌరవం విలువలను పెంపొంది ంచిందన్నారు. ఈ విలువలను స్వీకరించి, బాధ్యత తీసుకోవడానికి ఎప్పుడూ వెనకాడవద్దని జూనియర్లకు ఉద్బోధించారు. ఈ వేడుక ఎన్‌సీసీ క్యాడెట్ ప్రయాణాన్ని నిర్వచించే అంకితభావం, బాధ్యత యొక్క శక్తివంతమైన జ్ఞాపకంగా నిలిచి, అందులో పాల్గొన్న వారంద రిపై శాశ్వత ముద్ర వేసింది. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్రీడల డిప్యూటీ డైరెక్టర్ ఎం.నారాయణరావు చౌదరి, ఎన్ సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్ అజయ్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

చెట్టుకొమ్మ విరిగి తెగిపడిన వైర్లు తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ వెనకాల గాంధీ పార్క్ లో బుధవారం పెద్ద చెట్టుకొమ్మ విరిగి కాంప్లెక్స్ షాపుల పైన పడింది. అక్కడే పెద్ద కరెంటు లైన్ ఉండటంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ వచ్చింది. దాంతో షాపుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు భయపడి బయటకు పరుగులు తీశారు. కొద్దిసేపు షాపుల వద్ద ఉన్న ఇనుపరాడులకు విద్యుత్తు సరఫరా అయింది. ఎవరు కూడా రాడ్లను పట్టుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దాంతో పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వైర్లు మొత్తం షాపుల పైన పడటంతో షాపులు అన్నింటికీ విద్యుత్ షాక్ కొట్టింది. వైర్ల మీద చెట్టు పడటంతో అటువైపు ఇటువైపు ఉన్న కరెంటు స్తంభాలు వంగిపోయాయి. ఏది ఏమైనా పెను ప్రమాదం తప్పిందని షాపు యజమానులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని మల్లన్న బస్తీకి చెందిన బొల్లారం పబ్లిక్ స్కూల్ 25వ సిల్వర్ జూబ్లీ వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ప్రభుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. చదువు, సంస్కృతీ, సంస్కారం పాఠశాల పునాదులుగా చేసుకుని పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, పాస్టర్ జోబాబు, యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి, ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్లు ఉదయ భాస్కర్ రెడ్డి, సింహాచలం, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్నాకు వస్తున్న ఆశా కార్యకర్తను ఢీకొట్టిన కారు

తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు
ఆసుపత్రికి తరలించిన సీఐటీయూ నాయకులు, ఆశాలు

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్



జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొనడానికి స్కూటిపై వస్తున్న ఒక ఆశా కార్యకర్త ప్రమాదవశాత్తు కారు ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన చిర్ర భాగ్యలక్ష్మి బుధవారం తన స్కూటిపై సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొనేందుకు వస్తుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వచ్చే రోడ్డులో కారు ఢీకొట్టింది. కలెక్టరేట్‌కు 100 అడుగుల దూరంలో దర్గా కమాన్ సిగ్నల్ దగ్గర మూల మలుపు వద్ద టవేరా కారు స్కూటికి ఢీకొనడంతో భాగ్యలక్ష్మి కిందపడిపోయింది. భాగ్యలక్ష్మి తల వెనుకభాగంలో, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మిని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. భాగ్యలక్ష్మికి భర్త తిరుపతి, ఇద్దరు పిల్లలు ఉన్నారని తోటి ఆశావర్కర్లు తెలిపారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం పెంచకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్న సమయంలో వారి హక్కుల కొరకై కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమానికి వస్తే బతుకులు పూర్తిగా అంధకారమవుతున్నాయని ఆశాకార్యకర్తలు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సంఘట సంఘటన చూసి ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు

'సీబీఎల్'లో మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమం

నవతెలంగాణ-చౌటకూర్



మండలంలోని శివంపేట గ్రామ శివారులో గల సీబీఎల్ పరిశ్రమలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ సంగారెడ్డి జిల్లా ఉపా ధ్యక్షులు పాండురంగారెడ్డి.. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. నిజాం నవాబులకు ఎదురొడ్డి మల్లు స్వరాజ్యం పోరాడిందని గుర్తు చేశారు. ఆమె ఆశయాలను ముందుకుతీసుకు పోవాలని పిలుపు నిచ్చా రు. ఈ కార్యక్రమంలో సీబీఎల్ పరిశ్రమ వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, యూనియన్ నాయకులు, కాంట్రాక్టు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో నూతనంగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తాత్కాలికంగా ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి గాయత్రి దేవి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మోహన్ రెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఇక్కడ కేంద్రం మంజూరయిందని ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తాత్కాలిక కేంద్రం నిర్వహణకు భవనాన్ని సమకూర్చిన గ్రామ మాజీ సర్పంచ్ చందులత వీరు మల్లప్పలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, ఆక్సాన్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో సునంద, నేరేడు గుంట, తలెల్మ డాక్టర్లు శంకర్ నాయక్, సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా సవ్యంగా తయారయ్యేందుకు సహకరించాలి

నవతెలంగాణ-జహీరాబాద్



ఓటర్ జాబితా సవ్యంగా తయారయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించాలని ట్రెయినీ కలెక్టర్ మనోజ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో 18 ఏండ్లు నిండిన నూతన ఓటర్లు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, తప్పొప్పుల సవరణకు తీసుకోవాల్సిన విషయాలపై జాగ్రత్తల గురించి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాంరెడ్డి, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అంకెలు పెంచుతూ.. ఖర్చులో తుంచుతారా?

- చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపులేవి?
- అంబేద్కర్ అభయహస్తం అటుకెక్కినట్టేనా?
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.40,231,61,80 ఎస్సీ ఎస్‌డిఏఫ్ కింద కేటాయించారని.. అయితే కాగితాల్లో అంకెలు పెంచుతూ ఖర్చులు మాత్రం తుంచుతున్నారని కేవీపీఎస్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు అతిమెల మాణిక్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపు జరగలేదని.. అంబేద్కర్ అభయహస్తానికి ఏటా రూ.750కోట్లు కేటాయిస్తామన్న వాగ్దానం నిలబెట్టుకో లేకపోయిందన్నారు. రాష్ట్రంలో సుమారు 18శాతం ఉన్న దళితులకు ప్రతీ ఏటా బడ్జెట్లో అంకెలు పెంచుతూ ఖర్చులు మాత్రం తుంచుతున్నారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌లో నూటికి 30శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. 2023-24 బడ్జెట్లో రూ.13,617 కోట్లు ఖర్చు చేయలేదని ఆర్థిక మంత్రి శాసనసభలో ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కాగితాల్లో అంకెలు పెద్ద మొత్తాల్లో పెంచుతున్నారని అవి ఖర్చు చేయని నిధులను సబ్‌ప్లాన్ చట్టం ప్రకారంగా వచ్చే ఏడాది బడ్జెట్లో ఖర్చు చేయాలనే చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. దళితుల ఆవాసాలు, విద్యా, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి మౌలిక ప్రత్యక్ష ప్రయోజనాలపై దృష్టి సారించలేదన్నారు. రాష్ట్రంలో 64 లక్షల జనాభా కలిగిన దళితులకు కనీస ప్రాథమిక అవసరాలు తీర్చే విధంగా బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. గతేడాది చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి.. ప్రభుత్వం ఏటా రూ.750 కోట్ల రూపాయలు కేటాయిస్తామని రూ.12 లక్షలు అంబేద్కర్ అభయహస్తం కింద కేటాయిస్తామన్న మాటకు ఈ బడ్జెట్ లో నయాపైస కేటాయించలేదన్నారు. మూడు కార్పొరేషన్లుగా విడగొట్టి దళితుల మౌలిక అభివృద్ధికి కృషి చేస్తామన్న మాట నీటి మూటగా మారిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 మాసాలు గడిచినప్పటికీ దళిత అభివృద్ధి శాఖకు ఎందుకు మంత్రిని నియమించలేదో చెప్పాలన్నారు. బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు చర్చల సందర్భంగా ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క మొత్తం దళితుల గిరిజనుల సబ్‌ప్లాన్ నిధులపై ప్రత్యేక చర్చను ఏర్పాటు చేసి ఒక శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. బడ్జెట్ పై పునరాలోచన చేసి దళిత అభివృద్ధి శాఖకు మంత్రిని నియమించా లన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు సరిపడా నిధులు కేటాయించాలని అంబేద్కర్ అభయహస్తానికి ఏటా రూ.750 కోట్లు కేటాయిస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు.

డంప్‌యార్డును నిరాకరిస్తూ రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలో గల ప్యారానగర్ డంపింగ్‌యార్డ్‌ను నిరాకరిస్తూ గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్ గ్రామాల్లో భారీ సంఖ్యలో మహిళలు బుధవారం నిరసన చేపట్టారు. డంపింగ్‌యార్డ్ ఎత్తేసే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ సాక్షిగా డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన రిలే నిరాహార దీక్షలతో పాటు ప్రజా బ్యాలెట్ ఓటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే గ్రామాల వారికి నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


ఔదార్యాన్ని చాటిన వికలాంగుడు వెంకటయ్య

నవతెలంగాణ-జహీరాబాద్



తానే వికలాంగుడు అయినప్పటికీ.. ఆపదలో ఉన్న వారికి తనవంతు సాయంచేసి వికలాంగుడు వెంకటయ్య మరోమారు తన ఔదా ర్యాన్ని చాటుకున్నాడు. ఇటీవలే జరిగిన అగ్నిప్రమాదంలో దుకాణంలోని వస్తువులు, మిషన్లు కాలిపోయి మారుతి కార్పేంటర్ తీవ్రంగా నష్టపోయాడు. ఈ విషయం తెలియగానే మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల నిర్వాహకులు వికలాంగుడు వెంకటయ్య వెంటనే స్పందించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం సహకారంతో కార్పెంటర్ మారుతి సతీమణి సువర్ణకి రూ.10000 సాయం అందించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. దుకాణం అగ్ని ప్రమాదానికి గురికావడంతో కార్పేంటర్ తీవ్రంగా నష్టపోవడం చాలా కలిచివేసిందన్నారు. అందుకే పాఠశాల యాజమాన్యం సహకారంతో ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. ఆపదలో ఉన్నపుడు మమ్మల్ని ఆదుకున్నందుకు పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయ బృందానికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం




నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని మామిడ్గి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసమావేశంలో హెచ్ఎం చంద్రకళ మాట్లాడుతూ.. విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని.. అందరూ మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అంతకుముందు విద్యార్థుల ఆటాపాటలతో పాఠశాల ఆవరణం మొత్తం సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవింద్, సమియేద్దీన్, బాలకృష్ణ, కృష్ణవేణి ఉన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రంలో తనిఖీలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్ పట్టణంలో గల స్కూల్ యూనిఫాం టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని డీపీఎం నాన్ ఫాం జయశ్రీ రాజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మహిళలు బాగా నేర్చుకొని గ్రామ స్థాయిలో మహిళలకు శిక్షణ ఇచ్చి స్కూల్ యూనిఫాం నాణ్యతతో కుట్టేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సభ్యులు, ఏపిఎంలు, వంశీ కృష్ణ, సాయులు, కుమార్, చంద్ర శేఖర్ సీసీలు వెంకట్ సుందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య శుభ్రతపై అవగాహనా శిబిరం



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల కళాశాల ప్రాంగణంలో హెటిరో పరిశ్రమ గడ్డపోతారం నేతృత్వంలో ఆరోగ్య పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత అంశాలపై నిపుణుల బృందంతో రెండ్రోజుల ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. విద్యావాలంటీర్లు, ఉపాధ్యాయుల బృందాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.వెంకటనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, గడ్డ పోతారం హెటిరో పరిశ్రమ ప్రతినిధులు రామారావు, రాజులు పాల్గొన్నారు.

జహీరాబాద్ జాడ లేని బడ్జెట్

రెండోసారీ ఈ ప్రాంత ప్రజలకు నిరాశే.. నిమ్జ్, సంగమేశ్వర, బసవేశ్వరకు కానరాని నిధులు

నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్‌లో కూడా జహీరాబాద్‌కు అనుకున్న స్థాయిలో నిధులు రాలేదు. దాంతో స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జహీరాబాద్ పేరును జాతీయస్థాయిలో మారుమోగించిన నిమ్జ్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టు కొనసాగుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డిలకు సాగుకు నీరు అందించేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్ట్‌లకు కూడా కనీసం నిధులు కేటాయించలేదు. దాంతో ఈ నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి రోడ్ల మరమ్మతులకు అనుకున్న స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈయేడు కూడా రోడ్ల పరిస్థితి మారేలా లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ యేడు కూడా బడ్జెట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుకున్న స్థాయిలో నిధులు కేటాయించలేదు. దాంతో విద్యారంగ పరిస్థితిపై విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహించడంతో ఇరిగేషన్ శాఖలో పెండింగ్లో ఉన్నటువంటి ప్రాజెక్టులన్ని ఈయేడు కూడా మారే పరిస్థితి లేదు.

అన్ని వర్గాలకు అన్యాయమే..



బడ్జెట్‌లో వ్యవసాయ కూలీలకు, వారి సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. అంతేకాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరిచేందుకు నిధులు కేటాయించలేదు. దాంతో ప్రజలు ఆందోళన గురవుతున్నారు. ప్రధానంగా ప్రతీ మహిళకు నెలకు రూ.2500, పెన్షన్లు 4 వేలకు పెంచడం లాంటి పథకాలకు కేటాయింపులు లేదు. ఆ హామీని ఎలా అమలుపరుస్తారో తెలపాలి. మొత్తంగా ఈ బడ్జెట్‌తో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

-బి.రామచందర్, సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి

రైతులకు ప్రత్యేక కేటాయింపులు లేవు..



బడ్జెట్‌లో రైతులకు ప్రత్యేక కేటాయింపులు లేవు. దాంతో రైతుల పరిస్థితి దయనీయగా మారుతుంది. రెండో బడ్జెట్‌లో రైతు బీమా లాంటి పథకాలపై ఎంతోమంది రైతుల ఆశలు పెట్టుకున్నారు.. కానీ ఈ బడ్జెట్లో రైతుబీమాకు ఒక రూపాయి కూడా కేటాయించలేదు. రైతుల సంక్షేమానికి నిధులు కేటాయిస్తే వాటి ద్వారా డీసీఎంఎస్‌లు.. కోపరేటివ్ సొసైటీలు అభివృద్ధి చెంది ఆర్థికపరంగా రైతులను ఆదుకునేందుకు కృషి జరుగుతుంది.

-శివకుమార్, డీసీఎంఎస్ చైర్మెన్


యువతను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్



ఈ బడ్జెట్‌లో యువతకు తీవ్ర అన్యాయం జరిగింది. బడ్జెట్లో నిధుల కేటాయింపు లేకపోతే యువతకు నిరుద్యోగ భృతి ఎలా ఇస్తారో చెప్పాలి. కేవలం ప్రెస్‌మీట్లల్లో ప్రగల్భాలతో కాలయాప చేస్తున్నారే తప్పా యువతకు సంక్షేమం కోరుకోవడం లేదు. యువత సంక్షేమానికి పాల్పడితే యూనివర్సిటీలో నిర్బంధాన్ని ఎందుకు కొనసాగిస్తున్నారు. జహీరాబాద్‌కు గతంలో ఐటిఐను మంజూరు చేసి నిధులు కేటాయించినప్పటికీ.. నేటికీ ఐటిఐ నిర్మాణం జరగలేదు. దాంతో ఇక్కడి నిరుద్యోగ యువత వివిధ ప్రాంతాలకు చదువు కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జహీరాబాద్‌కు బీఎడ్ కళాశాలను మంజూరు చేయాలి.

- దిశెట్టి పాటిల్, బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్‌కు తీరని అన్యాయం



ఈ ప్రభుత్వంలో జహీరాబాద్ నియోజకవర్గానికి తీరని అన్యాయం జరిగింది. ప్రధానంగా ఇరిగేషన్ శాఖకు నిధులు కేటా యించాలని ఎన్నిసార్లు విన్నవించినా.. బసవేశ్వర, సంగమేశ్వర పథకా నికి అమల్లోకి తీసుకురావాలని శాసనసభలో మాట్లాడి విజ్ఞప్తి చేసిన ప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన నిమ్జ్ ప్రాజెక్టుకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. దాంతో ఈ ప్రాజెక్టు మరుగున పడే అవకాశం ఉన్నది. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించకపోవడం, భూములపై ఆధారపడిన కూలీలు, వ్యవసాయ కూలీలకు ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం సరికాదు.

-మాణిక్యరావు, ఎమ్మెల్యే

దళితుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం



దళితబంధు లాంటి పథకాలకు బడ్జెట్లో నిధుల కేటాయింపు లేదు.. మరీ దళితులను ఏ విధంగా ఆదుకుంటారో తెలపాలి. ఈ ప్రభుత్వం కేవలం అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి.. హామీలను అమలుపరచడంలో నిర్లక్ష్యం చేస్తోంది. దళితుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఊరుకోబోం.

-వై.నరోత్తం, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్

బడ్జెట్‌లో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత

బడ్జెట్లో మహిళలకు ప్రాధాన్యత



ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం మహిళల సంక్షేమానికి మా ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులు చేసింది. కేటాయింపులను క్రమ పద్ధతిలో అమలుపరిస్తే మహిళల అభివృద్ధి సాధ్యం.

-అస్మా, యూత్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు

యువతకు ప్రాధాన్యత కల్పించిన ప్రభుత్వం



బడ్జెట్లో యువతకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించిన సీఎంకి ధన్యవాదాలు. బడ్జెట్‌లో ఈ కేటాయింపులతో యువతకు ఎంతో ప్రాధాన్యత లభిస్తుంది. ఉపాధి దొరుకుతుంది.

-నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు

హామీలను అమలు చేసేలా బడ్జెట్



ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేసేందుకు బడ్జెట్లో కేటాయింపులు చేశారు. ప్రధానంగా అన్ని వర్గాల వారికి సంక్షేమానికి, ఆర్థిక అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయం. గత ప్రభు త్వాలు కులవృత్తులను విస్మరించాయి. మా ప్రభుత్వం కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్లో నిధులు కేటాయించింది.

-మహమ్మద్ తస్వీర్, టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్

'రాజీవ్ యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఒక రేషన్ కార్డుకు ఒకరే అర్హులు
- గరిష్టంగా నాలుగు లక్షల వరకు రుణం
- రుణంలో 60 నుండి 80 శాతం రాయితీ
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు జిల్లాలోని అన్ని వర్గాలకు చెందిన నిరుద్యోగ యువకులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ స్వయం ఉపాధి పథకానికి ఒక రేషన్ కార్డుకు ఒకరు మాత్రమే అర్హులన్నారు. ఈ స్వయం ఉపాధి పథకం ద్వారా గరిష్టంగా నాలుగు లక్షల వరకు రుణం అందిస్తారని.. తీసుకున్న రుణంలో 60 నుండి 80శాతం వరకు ప్రభుత్వం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. దరఖాస్తుకు ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తప్పనిసరి అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏదో ఒక అంశాల్లో ఎన్నుకొని స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఈ పథకం కింద స్వయం ఉపాధి రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. దీనిద్వారా రూ.400000 వరకు సాయం అందిస్తోందని.. అందులో కనీసం 60 నుంచి 80శాతం సబ్సిడీ కూడా అందిస్తోందన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పాన్‌కార్డు, పాస్ ఫోటో, లబ్ధిదారుడి ఫోన్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక రేషన్ కార్డులోని సభ్యుల్లో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.

ఉపాధి అంశాలు :

వ్యవసాయ అంశాలు, ఎద్దుల బండ్లు, ఆయిల్ ఇంజిన్, పంప్‌సెట్, ఎయిర్ కంప్రెషర్, పత్తి సేకరణ యంత్రం, వేరుశనగ మిషన్, వర్మీ కంపోస్ట్, ఆయిల్ ఫామ్ పంట పశుపోషణ గేదెలు, ఆవులు, డైరీ ఫారం, కోడిగుడ్ల వ్యాపారం, చేపల వ్యాపారం, మేకల పెంపకం,పాల వ్యాపారం, పౌల్ట్రీ ఫారం, గొర్రెల పెంపకం, సొంత వ్యాపారం ఎయిర్ కూలర్ల వ్యాపా రం, స్టీల్ సామాన్ల వ్యాపారం, ఆటోమొబైల్ షాపు, బేకరీ షాపు, గాజుల దుకాణం,హెయిర్ కటింగ్ షాపు,బుట్టల తయారీ షాపు,బ్యూటీ పార్లర్ షాపు, జనరల్ స్టోర్, ఇటుకలు తయారీ వ్యాపారం, డిష్ టీవీల ఏర్పాటు, వడ్రంగి షాపు, సీసీ కెమెరాల రిపేర్ షాప్, ఎలక్ట్రిక్ షాపు, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కేంద్రం వైరింగ్ కేంద్రం, మగ్గం టైలరింగ్, చెప్పులు అమ్మే దుకాణం, పండ్ల వ్యాపార కేంద్రం,పండ్ల రసాల దుకాణం, బట్టల దుకాణం, కిరాణం జనరల్ స్టోర్, జనరేటర్ షాప్, గిఫ్ట్ ఆర్టికల్ షాప్, బంగారు నగల దుకాణం, పిండి గిర్ని కేంద్రం,హెూటల్ ఏర్పాటు,ఐస్ క్రీమ్ పార్లర్ ఏర్పాటు, ఐరన్ బిజినెస్, లేడీస్ కార్నర్,లాండ్రీ షాపు డ్రై క్లీనింగ్,పేపర్ ప్లేట్ల తయారీ,లైట్స్ డెకరేషన్ సౌండ్ సిస్టం, అగరబత్తుల తయారీ, మినీ సూపర్ బజార్, మెడికల్ అండ్ జనరల్ స్టోర్, ఆటో టిఫిన్ సెంటర్,మోటార్ మెకానిక్, మోటార్ అండ్ పైప్ లైన్, మటన్ షాపు, పాన్ షాపు, పేపర్ బ్యాగుల తయారీ, ఫోటో అండ్ వీడియో షాపు, పిండి గిర్ని, ఫిల్టర్ వాటర్ కేంద్రం, రెడీమేడ్ బట్టల దుకాణం,చీరల వ్యాపారం, స్లాబ్ కటింగ్ మిషన్,స్ప్రే పెయింటింగ్ మిషన్, స్టీల్ అండ్ సిమెంట్, స్టిచింగ్ మిషన్,సప్లయర్స్ షాపు, మిఠాయిల షాపు,టైలరింగ్,వెల్డింగ్ షాపు, వాటర్ సర్వీసింగ్ సెంటర్, కూరగాయల వ్యాపార షాపు, టిఫిన్ అండ్ టీ షాప్,టీవీ మెకానిక్ షాప్,సెల్ ఫోన్ రిపేర్ షాప్,సిమెంటు ఐరన్ షాపు,సెంట్రింగ్ పరికరాల షాపు, చెప్పుల తయారీ షాపు, చికెన్ సెంటర్, బట్టల వ్యాపారం, కాఫీ హెూటల్, కాంక్రీట్ మిల్లర్స్ పరికరాలు, కూల్‌డ్రింక్ షాప్, క్రేన్,కర్రీస్ పాయింట్, సైకిల్ మెకా నిక్, వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు, డీజిల్ ఆటో, డిజిటల్ కెమెరా షాపు, సెటప్ బాక్స్‌ల ఏర్పాటు, కూరగాయల దుకాణాల కోసం దరఖాస్తు చేసకోవచ్చు అన్నారు. ఆసక్తి గల వారు ఓబీ ఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ https://tgobmmsne.cgg.gov.in ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చు అన్నారు. అర్హత ప్రమాణాలు, పథకాలు, ఇతర వివరాల కోసం https://tgobmmsne.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చునట్టు చెప్పారు.వచ్చే నెల 05 తారీఖు లోపల అర్హత గల అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్ మహిళా సమాఖ్య భవనంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మానవ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత నేరాలు' వంటి అంశాలపై వీవోఏ, వీవోబిలకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని ఏపీఎం ధనరాజ్ గిరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై చల్ల రాజశేఖర్ హాజరై.. మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు మిస్సింగ్ అయితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ మోసా లు, పోక్సో, వ్యభిచారం వంటి అంశాలపై వివరించారు. కొత్త చట్టాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ఐకెపి అధికారులు, మహిళలు సీఐ, ఎస్సైని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు స్వరూప, సీసీ రాజు పటేల్, పుండలిక్, మిట్టప్ప తదితరులున్నారు.

కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు

బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పట్ల హర్షం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

బీసీ రిజర్వేషన్ పెంపుదల చేయడం.. ఎస్సీ వర్గీకరణకు సబంధించి అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం, రాజీవ్ యువ వికాస పథకం చేపట్టడం పట్ల ఎమ్మెల్యే, ఎంపీ ఆదేశానుసారం డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్‌గౌడ్‌ల చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు, తెలంగాణలో ఓబీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. శాస్త్రీయంగా ఓబీసీల సంఖ్యను లెక్కించి వారి సమాన భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదించినందుకు, రాజీవ్ యువ వికాస్ పథకం ప్రారంభించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా నాయకులు, సీడీసీ చేర్మెన్ షాదుల్ సాబ్, శంకర్ సెట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చేర్మెన్, అశోక్ రెడ్డి ప్యాక్స్ చేర్మెన్..రమేష్ చౌహన్, శంకర్ ముదిరాజ్ శ్రీకాంత్ రెడ్డి, తోసిఫ్, మజర్ తదితరులు పాల్గొన్నారు..

పటాన్‌చెరు : చిట్కుల్‌లోని ఎన్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఏఐసీసీ అగ్రనేతలు,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ చిత్రపటాలకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లోక్ సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింప జేయడం అభినందనీయమన్నారు. ఈ రెండు బిల్లులు ఆమోదంతో భారత రాజకీయలపై సీఎం రేవంత్‌రెడ్డి చెరగని ముద్ర వేశారన్నారు.

అమీన్‌పూర్ : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా పాలనను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. బీసీ సమాజానికి రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో న్యాయం జరిగేలా బీసీ రిజర్వేషన్లు 42శాతానికి పెంచడం, ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడం ద్వారా యావత్ బహుజన సమాజానికి మేలు చేకూర్చిందన్నారు. ఇప్పటి వరకు బీసీ, ఎస్సీ వర్గాల హక్కులను కాపాడే దిశగా ఎటువంటి చర్యలు తీసుకోని ప్రభుత్వాలతో పోల్చినప్పుడే కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాలు ఎంత కీలకమో అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

జోగిపేట : జోగిపేటలోని ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం బాణాసచాలు కాల్చి సంబురాలు జరిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, మాజీ కౌన్సిలర్లుసురేందర్ గౌడ్, పట్లోళ్ల ప్రవీణ్, రంగా సురేష్, హరికృష్ణ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్ : తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చారిత్రాత్మకమైన విషయమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు పాలాభిషేకంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవే ర్చుతూ, అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షుడు తలారి అంజయ్య, యూత్ అధ్యక్షులు ఉదయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ చంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి. గోవ ర్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమల్‌రెడ్డి, ఇమ్రాన్. శ్రీనివాస్, గణపతి, సంగమేశ్వర్ గౌడ్, సత్తార్ పటేల్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏకగ్రీవంగా ఆమోదించి నందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబురాలు జరిపారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.ప్రభు మాట్లాడుతూ.. జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఏకగ్రీవంగా ఆమోదించడం సంతోషకరమన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



మాదిగ, మాదిగ ఉపకులాల 30 ఏండ్ల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ పోరాటానికి బాసటగా నిలిచి.. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జి.నర్సింలు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు కోసం కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, ప్రత్యేకంగా మంత్రి దామోదర రాజనర్సింహ, మాదిగ ఉద్యమాన్ని నడిపిన మందకృష్ణ మాదిగకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మాదిగ విద్యార్థి, యువత భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు పోవాలని విద్యార్థులను కోరారు.



ఎన్నో ఏండ్లుగా నలుగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా బీసీలకు రిజర్వేషన్ల పెంపు బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం.. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడం అభినందనీయమని మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాదిగ అన్నారు. ఈ వర్గీకరణకు సహకరించిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

రాయికోడ్ : మండల కేంద్రమైన రైకోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి బసవేశ్వర విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించి అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం టపాకాయలు కాల్చి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడం, బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టడం అభినందనీయమన్నారు. దేశంలోనే మొదటిసారిగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ఆమోదించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నర్సింలు, యువజన అధ్యక్షులు ప్రభాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్, తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పటేల్, రాజు గౌడ్, మండల ఎస్సీ నాయకులు శివకుమార్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పట్‌పల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపునకు బిల్లు, ఎస్సీల వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలపడం పట్ల మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షులు వెంకట్, డీసీ మెంబర్ పెద్దన్న, పోలీస్ చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మొహీనుద్దీన్, శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.























భక్తులకు సౌకర్యార్థం చలువ పందిల్లు

- దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-పాపన్నపేట

వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంగా రాజగోపురం నుండి గుడి వరకు చలువ పందిళ్ల ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాత అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని కలెక్టర్ సంబంధిత తహశీల్దార్, ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. దేవాలయ ప్రాంగణం అంతా కలియతిరిగి భక్తులు దర్శనానికి ఏ రోజు ఎంత మంది వస్తున్నారు, మంగళ, శుక్ర, ఆదివారం భక్తుల రద్దీ, సౌకర్యాల గురించి కలెక్టర్ ఆలయ నిర్వాహకులు, తహశీల్దార్‌లను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కలిగించడం కొరకు త్రాగునీరు, చలువ పందిళ్ల నిర్మాణం ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సౌకర్యాలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఆలయ ప్రధాన పూజారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భయపడుతూ పది పరీక్షలు రాయొద్దు

నవతెలంగాణ-శివ్వంపేట



సంవత్సరం పాటు పాఠశాలలో చదివిన దానిని పరీక్షల రూపంలో రాయాల్సి ఉండగా భయపడుతూ పరీక్షలు రాయొద్దని ఎచ్ఎం యాదగిరి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష హల్ టికెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఎచ్ఎం మాట్లాడుతూ పరీక్ష హలులో ఇన్విజిలేటర్ అందించే నిబంధనలను, సూచనలను శ్రద్ధతో వినాలని ఆయన సూచించారు. ప్రతి పేపర్‌పై హల్ టికెట్ నెంబర్‌ను వేయడం మాత్రం మరిచిపోవొద్దని సూచించారు. పరీక్ష సమయానికి పది నిముషాలు ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, శ్రద్ధతో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ రెడ్డి, జేత్యా నాగేందర్ రెడ్డి, దివ్య స్వప్న, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చాటాలి

- డీఈవో రాధా కిషన్

నవతెలంగాణ-శివ్వంపేట



పదో తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి వంద శాతం ఉత్తీర్ణతతో మెదక్ జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని డీఈఓ రాదా కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలను డిఈఓ సందర్శించారు. చండీ ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయానికి హాజరైన డిఈఓ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. గోమారం ఉన్నత పాఠశాలతో పాటు ఎస్సీ కాలనీ పాఠశాల, శివాలయం నగర్, చిన్నగొట్టిముక్కల జడ్పీ స్కూల్, ప్రైమరీ స్కూల్ ను సందర్శించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంప్యూటర్ ఆధారిత బోధనా విద్యను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం కోసం కంప్యూటర్ ఆధారిత బోధన అందించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు దాసు, రవీందర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

నవతెలంగాణ-శివ్వంపేట



రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ సర్కార్ మరోసారి మోసం చేసిందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన బుధవారం మాట్లాడుతూ అసెంబ్లీలో 2025-26 వార్షిక బడ్జెట్ లో ఆరు గ్యారెంటీల ఊసే లేదని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండోసారి బడ్జెట్ ప్రవేశపెట్టినగాని మహిళలకు ఇస్తామన్న రూ.2500, పెంచుతామన్న ఆసరా పెన్షన్ రూ.4000 లు ఎగ్గొట్టారని మండిపడ్డారు. యువత, నిరుద్యోగుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని, బడుగు బలహీన వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆయన విమర్శించారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట పట్టణ కేంద్రం ఎన్జీవోఎస్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన ఈ నిధులతో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి, సీనియర్ నాయకురాలు కురుమ లక్ష్మి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

నవతెలంగాణ-చేగుంట



స్థానిక ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్లకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన నేపథ్యంలో చేగుంట పట్టణ కేంద్రంలో మెదక్ చౌరస్తాలో సంబురాలు చేసుకున్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు మహేష్, ముజామిల్, బాల్రెడ్డి, కనకయ్య, తాడం వెంగళరావు, ఓబీసీ సెల్ అధ్యక్షులు అన్నం ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నర్సింలు, దుబ్బాక అసెంబ్లీ యువజన కార్యదర్శి సాయికుమార్ గౌడ్, యువ నాయకుడు శ్రీకాంత్, సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి, రాజ గౌడ్, జగన్ గౌడ్, కార్యకర్త లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారి క్షేత్ర స్థాయి పర్యటన

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని నర్సంపల్లి, నార్సింగి గ్రామాల పంట క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి యాదగిరి బుధవారం సందర్శించారు. ఎండల తీవ్రత పెరిగి భూగర్భ జలాలు తగ్గి బోర్ బావులలో నీరు తక్కువ అయి వరి పొలాలు ఎండిపోకుండా ఈ సందర్భంగా యాదగిరి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలాలలో సల్ఫైడ్ ఇంజూరి గమనించడం జరిగిందని, దాని వలన వరి మొక్క వేర్లు నల్ల బడి ఆకులు పసుపు రంగు లోకి మారుతాయని తెలిపారు. నివారణ కోసం 20 కిలోల యూరియా తో పాటు కార్బన్డిజం, మ్యాంకోజెబు 150 గ్రాముల మిశ్రమాన్ని చల్లు కోవాలని లేదా రెండు మిల్లీ లీటర్ల ఎగ్జామ్ మందును ఒక లీటర్ చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. క్షేత స్థాయి పర్యటన లో అధికారి తో పాటు రైతులు తోట రాజు, తోట శ్రీనివాస్, దాయం చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఎస్సి కాలనీలో పరిష్కారమైన నీటి సమస్య



నవతెలంగాణ-నార్సింగి

మండలం లోని జప్తి శివునూర్ ఎస్సీ కాలనీలో మంచి నీటి సమస్య ఉండగా గ్రామస్తులు విషయాన్ని గతంలో ఎంపీడీఓ ఏ. ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. నీటి సమస్యను తెలుసు కున్న ఎంపీడీఓ వెంటనే మండల ప్రత్యేక అధికారి ఆమోదంతో 15వ ఫైనాన్స్ నిధుల నుంచి త్రీ ఫేస్ మోటార్ కొనుగోలు చేసి బుధవారం బిగించి నీటి సమస్యను తీర్చారు. తమ నీటి సమస్యను అనతి కాలంలోనే తీర్చినందుకు ఎస్సి కాలనీ వాసులు ఎంపీడీఓకు కృతజ్ఞతలు తెలిపారు

మోసపూరిత బడ్జెట్

- ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరిత బడ్జెట్ అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. బుధవారం బడ్జెట్ పై ఆమె మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో పసలేదన్నారు. ఈ బడ్జెట్లో ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చే విధంగా లేదని ఆమె తెలిపారు. బడ్జెట్లో ప్రవేశపెట్టిన నిధులను ఖర్చు చేస్తారని నమ్మకం తనకు లేదన్నారు. గత బడ్జెట్లో రైతు రుణమాఫీ కోసం రూ.31 కోట్లు ప్రవేశపెట్టి ప్రస్తుత బడ్జెట్లో రూ.21 కోట్లు ఖర్చు పెట్టామనడం ఎంతవరకు సమంజసమన్నారు.. వారు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ప్రతినెల రూ.2500 ఇస్తామని, అందుకోసం బడ్జెట్‌లో ఎటువంటి నిధులు ప్రవేశపెట్టలేదన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.4000 ఇస్తామని ఆ విషయమై అసెంబ్లీలో ప్రస్తావించలేదన్నారు. బడ్జెట్‌ను సక్రమంగా అమలు చేస్తారని నమ్మకం తనకు లేదన్నారు.

పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదు

- బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమి లేదు
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట



రేవంత్ రెడ్డి సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి మండిపడ్డారు. 2025-26 బడ్జెట్‌పై బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రతి రంగానికి ప్రతి వర్గానికి వెన్నుపోటు పొడిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు స్థానిక ఎన్నికల నిర్వహణకు మంగళం పాడరాని, అన్ని వర్గాలను మోసం చేసిన బడ్జెట్ ఇది అని ఆరో పించారు. ప్రజల కష్టాలపైన ధ్యాస లేదని, ప్రజాధనాన్ని పార్టీకి పంచిపెట్టే కుట్ర చేశారన్నారు. ఆటో డ్రైవర్ నుంచి మొదలుకొని అన్నదాత వరకు అందరిని రేవంత్ సర్కార్ మోసమే చేసిందని, రాష్ట్ర బడ్జెట్ ఏ వర్గానికి కూడ మేలు చేసేలా లేదన్నారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీల పైన బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. ఆడ కూతురు వివాహానికి తుల బంగారం దిక్కు లేదని, చేనేత కార్మికులకు కేవలం 300 కోట్లు కేటా యిస్తూ పరిమితం చేశారన్నారు. ఆటో కార్మికుల, యాదవ సోదరుల ప్రస్తావన బడ్జెట్‌లో లదన్నారు. .వైన్స్ షాపులో 25 శాతం రిజర్వేషన్ గౌడన్నలకు ఇస్తామనీ హామీ ఇచ్చా రని, ఆ ప్రస్తావన లేదన్నారు. నిరుద్యోగ భృతి గురించి ఒక్క మాట లేదన్నారు. విద్యా భరోసా గురించి, గురుకుల పాఠ శాలలో పిల్లల చనిపోతే ఆదుకుంటామన్న మాటే లేదన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పేక మేడలా కుప్ప కూల్చారని, ఇది పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదు.

అర్హత లేని వైద్యం అందిస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన

నవతెలంగాణ-శివ్వంపేట

గ్రామాలలో అమాయక ప్రజలకు అర్హత లేకున్నా సరే వైద్యుల పేరిట అర్హత లేని వైద్యం అందిస్తే మాత్రం చర్యలు తప్పవని డిప్యూటీ డిఎంహెచ్ఓ సృజన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీసాయి నర్సింగ్ హోమ్‌ను డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సింగ్ హోమ్‌లో అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందులోని రికార్డులను తనిఖీ చేసి పలు వివరాలు సేకరించారు. మండల కేంద్రంలోని మరో రెండు ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేయడానికి వెళ్లగా అప్పటికే వాటికీ నిర్వాహకులు తాళం వేసి ఉంచడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నుండి టీబీగ్రస్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న పోషణ కిట్లను డాక్టర్ సాయిసౌమ్యతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ మాట్లా డుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ స్నేహభావంతో వైద్యం అందించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాయి సౌమ్య, డిఈఎంఓ శ్రీనివాస్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రూ.36.20 లక్షలకు తైబజార్ వేలం

- పశువుల సంత వేలం వాయిదా
- గత సంవత్సరం కంటే రూ.7.70 లక్షల అదనంగా పలికిన వేలం
- మున్సిపల్ నిర్ణయించిన రేట్లనే తీసుకోవాలి
- అదనంగా వసూలు చేసినట్టు తెలిస్తే చర్యలు
- మున్సిపల్ కమీషనర్ గణేష్‌రెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్ మున్సిపల్‌లో తైబజార్ వేలం గత సంవత్సరం కటే కూడా రూ.7.70 లక్షలకు అదనంగా పలికింది. గత సంవత్సరం రూ.28 లక్షలు కాగా, ఈ సారి రూ.36.20 లక్షలకు పలికింది. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 2025-26 సంవత్సరానికిగాను తైబజార్, పశువుల సంతలకు వేలం పాటలను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమీషర్ పాతూరి గణేష్‌రెడ్డి అధ్యక్షతన వేలం పాటలను నిర్వహించారు. తైబజార్ వేలంకు ఇద్దరు ఎం.అమృతమ్మ తుమ్మల గణేష్‌లు పోటీ పడ్డారు. వేలంలో గతంలో కంటే రూ.7.70 లక్షలు ఎక్కువగా పాటపడి అమృతమ్మ రూ.36.20 లక్షలకు తైబజార్‌ను దక్కించుకుంది. అలాగే పశువుల సంతకు గతంలో రూ.2.40 లక్షలు ఉండగా దానికి అదనంగా ప్రభుత్వం పాటగా రూ.2.64 లక్షలు కాగా పశువుల వేలం పాటకు ఇద్దరు చాడ రాములు, రమేష్‌లు పాల్గొన్నారు. వారు కేవలం రూ.1.80 వేలకు మాత్రమే పాటపాడడంతో



ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో పశువుల సంత వేలంను కమీషనర్ గణేష్‌రెడ్డి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం కమీషనర్ పాతూరి గణేష్‌రెడ్డి మాట్లాడుతూ తైబజార్‌లో వేలం దక్కించుకున్న వారు మున్సిపల్ నిబంధనలకు లోబడే వ్యాపారస్తుల నుంచి రుసుమును వసూలు చేయాలని సూచించారు. సంతకు వచ్చే వ్యాపారుల నుంచి గంపదారు 1 నుండి 15 బాక్సల వరకు రూ.100లు, 15 బాక్సల నుంచి 50 బాక్సల వరకు రూ.250 లు, 50 నుంచి అంత కంటే ఎక్కువగా ఉన్న వారి నుంచి రూ.500ల వరకు వసూలు చేయాలని సూచించారు. అలాగే చాప నేలపై కూర్చుని వ్యాపారం చేసే వారి నుంచి రూ.30లు, పండ్ల బండి వారి నుంచి రూ.25లు, సైకిల్ దారు నుంచి రూ.20లు, ఆటో, టాటా ఏసి దారు నుంచి రూ.100లు, (ట్రాన్స్‌పోర్టు లారీలు, డీసీఎంలు మినహ) ఇతర డీసీఎంలు, లారీ, వ్యాను దారు నుంచి రూ.200లు, ఇటుక, ఇసుక, కంకర లారీ దారు నుంచి రూ.120 లు, ఎండు మిర్చీ అమ్మకం దారు నుంచి రూ.60లు, పచ్చి మిర్చీ సంచికి రూ.30లు, బండి దారు నుంచి రూ.30లుగా మున్సిపల్ నిర్ణయించినట్లు కమీషనర్ తెలిపారు. అంతకంటే అదనంగా వసూలు చేసినట్టు తమకు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని కమీషనర్ హెచ్చరించారు. వాయిదా వేసిన పశువుల సంతను తిరిగి ఈ నెల 24న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమీషనర్ తెలిపారు. ఈ వేలం పాటలో మున్సిపల్ మేనేజర్ రఘువరన్‌తో పాటు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీ ఆమోదంపై విజయోత్సవం

- మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ- మనోహరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ జిందాబాద్, మంద కృష్ణ మాదిగ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చేపట్టిన సుదీర్ఘ ఉద్యమం కారణంగానే ఈనాడు ఎస్సీలకు వర్గీకరణ సాధించి న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చట్లపల్లి యాదగిరి, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు దళిత జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు చండి శ్రీనివాస్, నాయకులు కొమ్ము షేకులు,, జిల్లా నాయకులు సర్గల రాములు, కాల కంటి సత్యనారాయణ, గజ్జల కృష్ణ, సర్గల వినయ్, సర్గల ప్రవీణ్, వడ్యారం రామస్వామి, గజ్జల శ్రీకాంత్, పల్లెపాటి రెడ్డి, గజ్జల బాబు, మహిళా నాయకురాల్లు తప్పెట్ల పుష్ప, సర్గల జానకి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు

నవతెలంగాణ-టేక్మాల్



ఉత్తమ ఫలితాలు సాధించాలి అని పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేసిన భవాని నాగేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొడ్మట్ పల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను గ్రామ వాస్తవ్యులు భవాని నగేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు స్వప్న మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఎలాంటి భయాందోళనకు గురి కావద్దన్నారు. ఈ పరీక్ష సమయాల్లో విద్యార్థుల తల్లి దండ్రులు ఎలాంటి పొలం పనులు చెప్పకుండా విద్యార్థులు చదువుకోడానికి పూర్తిగా సహకరించాలన్నారు. విద్యార్థులకు సహకారాన్ని అందించిన భవాని నగేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కొటంగారి యాదమ్మతో కలిసి భవాని నగేష్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, అశోక్, దశరథ్, లత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులు సేవాదృపథంతో పని చేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జడ్జి జితేందర్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



జిల్లాలోని రైతుల పట్ల బ్యాంక్ అధికారులు సేవా దృపథంతో పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జడ్జి జితేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ పి.లక్ష్మి శారద ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులతో రైతులు, అగ్రికల్చర్ అధికారులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విన్సంట్ వినయ్, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు, తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు, తహసిల్దార్ సింధూ రేణుక, ఏడిఏ విజయ నిర్మల, తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదవ్ గౌడ్, మెదక్. లీడ్ బ్యాంకు మేనేజర్, బ్యాంకు అధికారులు, అగ్రికల్చర్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై మహిళలకు శిక్షణ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండల సమాఖ్య ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం పై బుధవారం ఐకెపి కార్యాలయంలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం లక్ష్మీ నర్సమ్మ మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రతి ఒక్కరూ నడుం బిగించాన్నారు. అన్ని గ్రామాలలో ఉన్న మహిళలకు చట్టాలపైన లైంగిక దోపిడీ, శ్రమ దోపిడీ, అవయవాల దోపిడీ, డ్రగ్స్ రవాణా లాంటి కార్యక్రమాలపైన తరచు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. సైబర్ నేరాల పైన వాట్సాప్, ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇలా పైన మహిళలకు అవగాహన కల్పిస్తే ఈ నేరాలను కొంతవరకైనా జరగకుండా చూడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అధ్యక్షురాలు, వివోఏలు, సీసీలు స్వామి, రామస్వామి, శ్వేత ,అంజయ్య నాయక్, మమత, ఆడిటర్ లాలూ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

నవతెలంగాణ-నార్సింగి



పరీక్షల్లో రాణించి మంచి మార్కులు సాధించాలని స్థానిక ఎం.ఈ.ఓ మురళి మోహన్ 10వ తరగతి విద్యార్థులకు సూచించారు. పిల్లలు చక్కగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పట్టణ కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం జరిగిన 10 వ తరగతి విద్యార్థుల మోటివేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రణాళిక బద్ధంగా చదువుకుని పరీక్షల్లో రాణించాలని ప్రముఖ వ్యాఖ్యాత మోటివేషనల్ స్పీకర్ ఏజాజ్ అహ్మద్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని, ఒత్తిడిని జయించి నప్పుడే అన్ని రంగాల్లో రానిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సలహాలు సూచనలు పాటించి పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎం.ఈ.ఓ, పాఠశాల సిబ్బంది ఏజాజ్ అహ్మద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట

అమ్మవారి ఆశీర్వాదాలతో ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ వేడుకలలో ఆమె పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను, దేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతర ఉత్సవాలకు విచ్చేసిన ముఖ్య అతిథులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, మాజీ మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ రమాకాంత్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ లాయక్, గూడూరు యాదగౌడ్, లక్ష్మీనర్సయ్య, సూరారం నర్సిములు, గుద్దేటి నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, వైస్ రాజేందర్ నాయక్, గౌడసంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా పరిషత్ మాజీ ప్రణాళిక, ఆర్థిక సంఘం సభ్యులు, మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అమ్మవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

- అండగా నిలిచిన హెడ్ కానిస్టేబుల్

నవతెలంగాణ-శివ్వంపేట



పేదింటి కుటుంబాలకు ఎదో ఒక రకంగా సహకారం అందించడమే తన లక్ష్యమని పిల్లుట్ల నివాసి, హెడ్ కానిస్టేబుల్ జనుముల నెల్లూరు అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ముంద్రాతి రామమ్మ ఆకస్మాత్తుగా ఇటీవలే మరణించిన విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ నెల్లూరు రూ.5 వేల ఆర్థిక సహకారాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి బాధిత కుటుంబానికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఆర్థికంగా అండగా నిలుస్తున్న హెడ్ కానిస్టేబుల్ నెల్లూరును పిల్లుట్ల గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగమణి బాలేష్, ముంద్రాతి నర్సిములు, ముంద్రాతి లచ్చయ్య, దాసరి నర్సిములు, దాసరి లచ్చయ్య, దాసరి బుచ్చిబాలేష్, ముంద్రాతి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఫోటో ఫన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో చలి వేంద్రం

నవతెలంగాణ-టేక్మాల్



మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ప్రతి ఏటా ఫొటోఫన్ యాజమాన్యం ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి వేసవి చలి వేంద్రంను జిల్లా మైనార్టీ అధ్యక్షులు షైక్ మజహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ చలి వేంద్రంను మండల కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ సర్వాణి సరోజ మల్లేశం ప్రారంభించారు. మానవసేవయే మాధవ సేవ అనే విధంగా సమాజ సేవ చేస్తున్న మాజహర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లారెడ్డిలు, మాజీ ఎంపీటీ సీ సక్రు నాయక్, సీనియర్ నాయకులు విద్యా సాగర్, రాష్ట్ర యస్ యస్ యు ఐ కార్యదర్శి మహేష్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంగమేష్ గౌడ్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

బీసీ బిల్లు చారిత్రాత్మక విజయం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్
- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నర్సాపూర్



అసెంబ్లీలో బీసీ వర్గీకరణ బిల్లుకు 42 శాతం చట్టబద్ధత కల్పిస్తూ ఆమోదం తెలపడం చారిత్రాత్మక విజయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ ఆమోదం తెలపడం పట్ల, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ బీసీలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కలను 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆమోదం సంతోషించే దగ్గ విషయమన్నారు. ఏ పార్టీ చేయని విధంగా కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును సైతం చట్టసభల్లో ఆమోదం తెలపడం సంతోషించదగ్గ విషయమన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశం, శ్రీనివాస్ గుప్తా, లలిత, ఉదయ్ కుమార్, అశోక్ గౌడ్, సాగర్, రాధాకృష్ణ, నర్సింలు, అశోక్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులుగా చిట్టెల సంపత్



నవతెలంగాణ-సిద్ధిపేట

దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులుగా చిట్టెల సంపత్ ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రావు భవన్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ దివ్యాంగుల సంఘాలన్నీ ఒకే గూటి క్రిందకు వచ్చి దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ (డి.జాక్)గా ఏర్పాటు అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంపత్ మాట్లాడుతూ.. గౌరవ అధ్యక్షులుగా దండు శంకర్, గౌరవ సలహాదారులుగా బొంగోని శ్రీశైలం గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గూడూరు దుర్గయ్య, ఉపాధ్యక్షులుగా కేమ్మసారం అశోక్, అరికెలా సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా పిల్లి అంజయ్య, సహాయ కార్యదర్శిగా కొంపెల్లి వీరేష్, అరగొండ మల్లేశం, కోశాధికారిగా గూడూరు బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్‌గా మేకల మమత, ముక్కపల్లి కనకరాజు, గొట్టిపర్తి సురేష్, చొక్కం నర్సింలు, కొమ్మరాజుల మల్లేశం, మహిళా విభాగం అధ్యక్షులుగా లావుడ్య సరిత, ప్రధాన కార్యదర్శిగా బాలమణి, కోశాధికారిగా కండ్లకోయ దేవలక్ష్మి, సోషల్ మీడియా విభాగం కన్వీనర్‌గా దండు నరేష్, కో-కన్వీనర్ గా రాజు, కార్యదర్శిగా పిడిశెట్టి నారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ గా జింక యాదగిరి, కార్యదర్శిగా చిట్టెల శ్రీకాంత్, దాదాపుగా 21 మందితో ఒక బలమైన జేఏసీ గా ఏర్పాటు కావడం జరిగిందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
గురువారం | 20 మార్చి 2025 | www.navatelangana.com

'పొద్దు తిరుగుడు' ను పూర్తిగా ప్రభుత్వమే కొనాలి

- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్



నవతెలంగాణ-సిద్ధిపేట

తెలంగాణ రైతుల పాలిట రేవంత్ రెడ్డి శాపంగా మారాడని, గద్దెనెక్కి అనేక ఆంక్షలు విధిస్తున్నాడని, పొద్దు తిరుగుడు పంట పూర్తిగా ప్రభుత్వ కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం చిన్నకోడూరు మండల కేంద్రంలోని సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులను నమ్మబలికిన రేవంత్ రెడ్డి నేడు రైతులకు శాపంగా మారారని, రైతులు పండించిన పొద్దు తిరుగుడు ఎకరాకు 6 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదన్నారు. మొత్తం పంటను ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రెడ్డి రాజిరెడ్డి, ఏదుల చంద్రారెడ్డి, రెడ్డి మహేందర్ రెడ్డి, యాట రాజేష్, మల్లయ్య, బాలరాజ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంకెల గారడీ

- కార్మికుల వేతనాల పెంపుదల ఊసు లేదు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్లయ్య



నవతెలంగాణ-గజ్వేల్

ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీగా ఉన్నదని, ఒక పక్కన ఆదాయం లేదు ఆర్థిక సంక్షోభం కొనసాగుతుంది. సంఖ్య కోసం ఎక్కువ లెక్కలు చూపడం కోసం మరల రూ.3లక్షల 4 వేల కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేశారన్నారు. కేటాయింపులు చేసిన వాటిని పూర్తిగా ఖర్చు చేయాలన్నారు. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలంటే వేతనాలు పెంచాలన్నారు. నిర్వాసితులకు ప్రత్యేక పాక్యేజీలు లేవన్నారు.

డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 21 ఉదయం 10 గంటల నుంచి మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్‌సిహెచ్. శోభారాణి తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు పీజీ, డిగ్రీ పూర్తి చేసిన వారు లేదా ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులని, వీరు రెజ్యూమ్ జిరాక్స్ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలని, రిజిస్ట్రేషన్ ఇతర వివరములకు 8985710323 నెంబర్ను సంప్రదించాలని తెలియజేశారు. ఇందులో ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫినాన్స్, ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్, అపోలో, జెప్టో ఇతర కంపెనీలు పాల్గొంటా యని అభ్యర్థులు సకాలంలో రావాలని వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

నిరుపేదల నిధి 'సీఎం సహాయ నిధి'

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ




నవతెలంగాణ-సిద్దిపేట

నిరుపేదలకు నిధి ముఖ్యమంత్రి సహాయనిధి అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండావెల్లి గ్రామానికి చెందిన గద్దల బాబుకు రూ.60 వేలు, రాజశేఖర్‌కు రూ.35వేల చెక్కులను అందేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్ రెడ్డి, పోలీస్ జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐని ఉపయోగించుకోవాలి

- ఎంఈఓ రంగనాయక్



నవతెలంగాణ-అక్కన్నపేట

ఏఐ సాంకేతికతను విద్యార్థులు ఉపయోగించుకోవాలని అక్కన్నపేట మండల విద్యాధికారి రంగ నాయక్ అన్నారు. బుధవారం రామవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ నేర్చుకోవడానికి ఏఐ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఐ సాంకేతికను వినియోగించుకొని విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో సాంకేతికతనే ప్రపంచాన్ని నడిపిస్తుందని ఎంఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవినీతి




నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులను కొందరు దోచుకున్నారని ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు అజ్మత్ ఆరోపించారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చిన డెవలప్మెంట్ ఫండ్స్‌ను తమ జేబుల్లో వేసుకుంటున్నారని, త్వరలోనే ఆధారాలతో బయటపెట్టి, మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు తెలిపారు. కొందరు లెక్చరర్లు సరైన సమయానికి కళాశాలకి రావడం లేదన్నారు. రేపటినుంచి ఎన్ఎస్ యూఐ కళాశాలపై దృష్టి పెడుతుందన్నారు. ప్రతి డిపార్ట్మెంట్‌కి వెళ్లి ఎవరివైతే సరైన సమయానికి కళాశాలకి రాకుండా ఉంటారో ఆ కుర్చీని తక్షణమే కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. కళాశాలలో కనీసం శుభ్రత పాటించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట అసెంబ్లీ అధ్యక్షులు వహాబ్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీం, ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అజ్మత్ అలీ, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు సాయి ప్రతాప్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు నవాజ్, షాహిద్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో జాగ్రత్తలు వహించాలి


- ఎంపీడీవో భాస్కర శర్మ




నవతెలంగాణ-దుబ్బాక

ఎండలు ముదురుతున్న వేళ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఎస్) ద్వారా చేపట్టిన పనుల్లో కూలీలు తప్పనిసరిగా జాగ్రత్తలు వహించాలని ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ అన్నారు. బుధవారం దుబ్బాక మండలం పద్మనాభునిపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను, నర్సరీని పంచాయతీ సెక్రెటరీ స్వామితో కలిసి పరిశీలించారు.అనంతరం ఎంపీయూపీఎస్,అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను,వంటగదిని శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.

సింగన్నగూడ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్






నవతెలంగాణ-ములుగు

సింగన్నగూడ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దేవులపల్లి పరశురాము లుకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ డైసీ ఆధ్వర్యంలో అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా సింగన్నగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి రహీం, పాఠశాల ఉపాధ్యాయులు పరశురాములను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగికి ఘన సన్మానం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకలోని మున్సిపల్ కార్యాలయంలో 13వ వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన పెంబర్తి శ్రీకాంత్ ఇటీవలే సిద్దిపేటలోని బాయ్స్ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు. కమిషనర్ మాట్లాడుతూ.. తమ కార్యాలయ సిబ్బంది ఉన్నత ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. వారి వెంట మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మా భూములు మాకేనని మర్లవడ్డ జనం.!

- ఇండస్ట్రియల్ పార్కు మాకొద్దు
- చౌటపల్లి గ్రామ సభలో ప్రజల నిరసన
- తినే కాడ బుక్క గుంజుకోవద్దని ఆవేదన





నవతెలంగాణ-అక్కన్నపేట

తాతలు తండ్రులు నాటి నుంచి భూముల్ని సాగు చేసుకుని మా కడుపు నింపుకొంటున్నం. అకస్మాత్తుగా ఇండస్ట్రియల్ పార్కు పేరుతో ప్రభుత్వం మా భూములు గుంజుకోవాలని చూస్తోంది. మాకు జీవనాధారమైనటువంటి భూములను మేము ఇవ్వడానికి సిద్ధంగా లేమంటూ చౌటపల్లి గ్రామస్తులు అన్నారు. బుధవారం ఇండస్ట్రియల్ పార్కు కోసం గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి గ్రామ సభలో రైతులు భూములు ఇవ్వబోమంటూ ఖరాకండిగా చెప్పేశారు. పార్కు నిర్మాణం కోసం రైతుల అభిప్రాయం తెలుసుకోవడానికి ఆర్డిఓ రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ఈ గ్రామ సభకు చౌటపల్లి గ్రామంతో పాటు జనగామ, తోటపల్లి, గ్రామస్తులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా జీవనాధారం అయినటువంటి భూములను ఇండస్ట్రీకి ఇస్తే మా పరిస్థితి ఆగమ్య గోచరమే అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములు కోల్పోతే మా సర్వస్వం కోల్పోయినట్టే అని, వ్యవసాయ పనులు తప్ప, మాకు ఇంకే పనులు రావన్నారు. దాదాపు సగం కంటే ఎక్కువ రైతులు భూములు ఇండస్ట్రీకి తీసుకోవద్దని ఆర్డీవో రామ్మూర్తికి వినతి పత్రాలు సమర్పించారు. మాకు ఇష్టం లేకున్నా పార్కు తీసుకువచ్చి మా భూములను గుంజుకుంటామంటే అస్సలు ఊరుకోమని, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం పోలీస్ పహారా పెట్టి బెదిరింపులకు గురి చేస్తూ మా భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మరికొంతమంది రైతులు మా భూములు పార్కుకు ఇవ్వడం ఇష్టమే కానీ మాకు అందించే పరిహారం విషయంలో ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. బయట ఒక్క ఎకరా భూమి దాదాపుగా రూ40 నుంచి50 లక్షల వరకు ఉందని , మీరు ఇచ్చే పరిహారం కూడా ఆ విధంగానే ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామ్మూర్తి, ఏసీపీ సతీష్, అక్కన్నపేట తహసిల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, హుస్నాబాద్ తాసిల్దార్ రవీందర్ రెడ్డి, చౌటపల్లి కార్యదర్శి సతీష్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆశా'లకు బడ్జెట్ సమావేశంలో రూ.18వేలు కనీస వేతనం నిర్ణయించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్ది పేటకలెక్టరేట్

రాష్ట్రంలో ఆశా వర్కర్‌లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి, ఇతర సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిద్ది పేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఇన్చార్జి ఏవోకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గోపాల్ స్వామి మాట్లాడుతూ..ఎన్నికల్లో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, మరణిస్తే మట్టి ఖర్చుల కింద రూ.50 వేలు చెల్లిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు,సెలవులు ఇస్తామని, టార్గెట్లను రద్దు చేస్తామని పలు నిర్దిష్ట హామీలను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, 2022-23లో ఆశాలు చేసిన 'లెప్రసీ సర్వే' డబ్బులను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య, కొంపల్లి భాస్కర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలమని, ప్రవీణ చల్లారపు నీరజ, కవిత, భాగ్యలక్ష్మి, స్వప్న, వరలక్ష్మి, విజయ, భాగ్య, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 20 శాతం నిధులను కేటాయించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి.శ్రీకాంత్



నవతెలంగాణ-సిద్దిపేట

విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం అవుతుందని, పేద వర్గాలకు చెందిన పిల్లల సురక్షిత భవిష్యత్తుకు విద్యనే దారి చూపుతుందని, బడ్జెట్ ప్రసంగంలో గొప్పగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా కేటాయింపుల వరకు వచ్చేసరికి విద్యారంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కూడా బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించలేదని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి గొప్పగా ప్రసావించిన ప్రభుత్వం, రాష్ట్రంలో నెలకొల్పబోయే 58 స్కూల్స్ నిర్మాణానికిగాను రూ.11,600 కోట్లు కేటాయించింది కానీ, రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్న ఉన్నత విద్య గురించి వాటిలో ఉన్న విద్యార్థుల భాగోగుల గురించి మాట్లాడకుండా వాటి అభివృద్ధి కొరకు అరకొర నిధులు కెటాయించి మమా అనిపించుకున్నదాని అన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి కనీసం 20 శాతం నిధులను విద్యరంగ అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

'రాజీవ్ యువ వికాసం'లో రాజకీయ జోక్యం ఉండొద్దు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య



నవతెలంగాణ-కొండపాక

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక ఎమ్మెల్యేలు చేస్తారని చెప్పడం సరైనది కాదని, దీంట్లో రాజకీయ జోక్యం ఉండొద్దని సీపీఐ(ఎం) కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకుల జోక్యం లేకుండా కార్పొరేషన్ల అధికారుల ద్వారానే రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలన్నారు. ఈ పథకంలో సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యేల ద్వారా చేయాలనే నిర్ణయం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. బ్యాంకు లింకులు పెట్టడంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరిగి వేసారి పోయే పరిస్థితి వస్తుందన్నారు. ఎలాంటి బ్యాంకు లింకులు లేకుండా అర్హులైన యువతి యువకులకు రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో దళిత బంధు పథకం అమలు చేసింది. దీంతో నిజమైన లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. లబ్ధిదారులు ముందే సబ్సిడీ కట్టాలని నిబంధనలను విరమించుకొని బ్యాంకు లింకు లేకుండా అర్హులకు ఇవ్వాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈ నెల 21 నుంచి పది పరీక్షలు
- మర్కుక్ ఎంఈవో వెంకట రాములు



నవతెలంగాణ-మర్కుక్

మార్చి21 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లను చేస్తున్నట్లు మర్కుక్ మండల విద్యాధికారి ఎ.వెంకట రాములు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ.. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశామన్నారు. మండలంలోని చేబర్తి, దామరకుంట, మర్కుక్, పాములపర్తి, మర్కుక్ కస్తూర్బా బాలికల పాఠశాల్లో 240 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం మర్కుక్, పాములపర్తి పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.16 మంది ఇన్విజిలేటర్లు, సిఎస్‌లు ఇద్దరూ, డీఈవోలు ఇద్దరు ఉన్నారు. పరీక్షల కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా పూర్తి ఏర్పాట్లను చేశామన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో పది పరీక్షలు

నవతెలంగాణ-కొండపాక

పదో తరగతి పరీక్షలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేటట్టు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 580 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. కొండపాక బాలుర పాఠశాల కేంద్రంలో 233 మంది విద్యార్థులు, కొండపాక ఆదర్శ పాఠశాల కేంద్రంలో 240 మంది, దుద్దెడ ఉన్నత పాఠశాల కేంద్రంలో 107 మందిని కేటాయించినట్లు తెలిపారు. ముగ్గురు చీఫ్ సూపరింటెంట్లు, ముగ్గురు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, 30 మంది - ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా విధులు నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీటి వసతి, ఫర్నిచర్, ఫ్యాన్లు విద్యుత్ సదుపాయం తదితర అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. .ప్రతి విద్యార్థి సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 9.30 కు పరీక్షలు ప్రారంభమవుతాయని గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ ఉంటుందని ప్రజలు గమనించాలన్నారు.

చిరుత పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

- దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ -తిమ్మక్ పల్లి గ్రామ శివారుల మధ్య ఉన్న గల్వని చెరువు ప్రాంతంలో చిరుత పులి మంగళవారం చిరుత పులి సంచరిస్తున్నట్ల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు చిరుత పులి ఆచూకీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. బుధవారం దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ గ్రామాలు సందర్శించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుత పులి జాడ కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిరుత పులి ఎప్పుడు ఒకే చోట నివాసం ఉండదని తరచూ తిరుగుతుంటుందని తెలిపారు. గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిరుత పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులెవరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య, సెక్షన్ ఆఫీసర్లు హైమద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్లు జహంగీర్, వేణు, కానిస్టేబుల్ స్వామి, ఎస్పి కానిస్టేబుల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్

నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 3న జరిగే బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి శివలింగు కృష్ణ అధ్యక్షతన బుధవారం గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్, వేములగట్టు, లింగరాజుపల్లి, ముట్రాజుపల్లి, సింగారం గ్రామాల్లో కార్మికులను కలిసి అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయాలని, సహజ మరణం రూ. 5 లక్షలు, ఆక్సిడెంట్ రూ.10 లక్షలు, 55 ఏండ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్, డెలివరీ రూ.50 వేలు, మ్యారేజ్ రూ.1 లక్ష, అర్హులైన కార్మికులకు డబల్ బెడ్ రూం ఇండ్లు, అడ్డాల వద్ద విశ్రాంతి గదులు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇతర బెనిఫిట్స్ సాధించాలంటే పోరాటం చేయడానికి, సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అందే అశోక్, సంఘం జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్, శనిగరం బాబు, మన్నే కనకయ్య, పోతుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమించాలి



- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

నాడు భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కష్టజీవులందరిని ఐక్యం చేసి దొరలు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజా పోరు నడిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మాజీ ఎమ్మెల్యే అమరజీవి మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి మల్లారెడ్డి, జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. పీడిత వర్గాల విముక్తి కోసం జరిగిన పోరాటంలో మల్లు స్వరాజ్యం ముఖ్య భూమిక పోషించారన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వెట్టిచాకిరి రద్దు చేయాలని, దున్నేవానికి భూమి కావాలని, నైజాం నవాబు గద్దె దిగాలని, నినాదాలతో సాగిన ఈ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించగలిగిన ఉద్యమం అని అన్నారు. దేశవ్యాప్తంగా భూసంస్కరణల చట్టం, కౌల్దారి చట్టం, పౌర హక్కుల చట్టాలు వచ్చాయని ప్రజలకు స్వేచ్ఛ స్వతంత్ర్యాలు లభించాయని ఈ పోరాటం అనేక విజయాలు సాధించిందన్నారు. ఈ చారిత్రాత్మకమైన పోరాటంలో మల్లు స్వరాజ్యం పాత్ర అద్వితీయమని కొనియాడారు. ఎర్రజెండానే ఊపిరిగా పీడిత ప్రజల విముక్తే ధ్యేయంగా చివరి క్షణం వరకు ఎర్రజెండా నీడన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలుగా, శాసన సభ్యురాలుగా ఎత్తిన జెండా విడవకుండా చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప వీరనారి మల్లు స్వరాజ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, చొప్పరి రవికుమార్, తాడూరి రవీందర్, జాలిగపు, శిరీష, నాయకులు టి రవీంద్ర చారి, తదితర నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేతకు మొండి చేయి



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేతకు కేవలం రూ.371 కోట్లు కేటాయించడం చాలా దురదృష్టకరమని సిద్దిపేట జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను అన్ని రకాల ఆదుకుంటున్న ప్రభుత్వం చేనేతలను విస్మరించడం దురదృష్టకరమన్నారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించి,ఆత్మహత్యలు నివారించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చేనేత కార్మికులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసి, చేనేత సంఘాలు బలోపేతానికి క్యాష్ క్రెడిట్‌లు మంజూరు చేయాలని, ప్రభుత్వం వెంటనే చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో చేనేతకు మొండి చేయి అని చెప్పవచ్చన్నారు.


అంకెల గారడీ తప్ప హామీల అమలు లేదు



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంకెల గారడీ తప్ప ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఎక్కడ కనబడడం లేదని గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీల అమల్లో మాత్రం మొండి చేయి చూపిస్తుందన్నారు. ప్రజలకు నేరుగా దక్కాల్సిన సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇవాల్టి బడ్జెట్ కూడా గతంలో లాగానే అంకెలకే పరిమితమైందన్నారు. ఈ బడ్జెట్లో సైతం గ్యారంటీలకు నిధులు కేటాయించకపోవడం వల్ల ఆ హామీలు ఇక నెరవేరవని స్పష్టత వచ్చిందన్నారు. వ్యవసాయానికి పెద్ద పీట అని చెప్పి అటు రైతులని భ్రమ పెట్టి కనీసం రైతుబంధు అమలు విషయంలో కూడా రైతులకి సరైన టైములో ఇవ్వడం లేదన్నారు. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి ఇవాళ ఉద్యోగాల ఊసే లేకుండా బడ్జెట్ ప్రసంగం ముగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తదితరులున్నారు.

దళితులకు బడ్జెట్‌లో రూ.6,512 కోట్ల కోత



నవతెలంగాణ-గజ్వేల్

గత ఏడాది కంటె దళితుల బడ్జెట్‌లో రూ.6,512 కోట్లు తగ్గించి అన్యాయం చేశారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధికి 2024-25 బడ్జెట్‌లో రూ.33,127 వేల కోట్లను కేటాయించగా ఈ ఏడాది కేవలం 26,615 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. బడ్జెట్ ఉపన్యాసంలో ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్‌ను నిర్లక్ష్యం చెసిందని చెపుతు 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులను 13,617 ఖర్చు చేయనందున ఈ బకాయిలను కలిపి నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారన్నారు. అన్ని కలిపి ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.40,232 వేల కోట్లను కేటాయించారన్నారు. రూ. 23,303 కోట్లను ఖర్చుచేయకుండా మిగిలిన బకాయిలను ఎందుకు క్యారీ పార్వడ్ చేయలేదని ప్రశ్నించారు. బడ్జెట్ ఉపన్యాసంలో చేవెళ్ళ డిక్లరేషన్ గురించి కాని అంబేద్కర్ అభయ హస్తం గురించి ఊసెత్త లేదన్నారు. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు కేటాయించిన బడ్జెట్‌లను సవరించి పెంచాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ క్యాడర్ బడ్జెట్



నవతెలంగాణ-గజ్వేల్

శాసనసభలో ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ క్యాడర్ బడ్జెట్‌గా ఉందని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రూ.6 లక్షల కోట్లు 5 లక్షల మంది కార్యకర్తలకు రూ. 4లక్షల చొప్పున పంపిణీ చేసుకున్నందుకు ఈ బడ్జెట్ కేటాయించినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కోసం ఈ బడ్జెట్ను ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టినట్లు విమర్శించారు. ఇది పేదల బడ్జెట్ కాదన్నారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ ఉన్నా యని 420 హామీ లు ఎక్కడ అమలు చేస్తారని ప్రశ్నించారు. పేదలు ఆశించిన బడ్జెట్ కాదని ఆయన అన్నారు. తులం బంగారం, లక్ష నగదు, పింఛన్ పెంచడం ఎక్కడుందన్నారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగదితో పాటు వసతి గదులను సందర్శించి మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని స్పెషల్ ఆఫీసర్‌కు సూచించారు. చదువులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే 10వ తరగతి కీలకమని విద్యార్థులకు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు కాసేపు పాఠాలను బోధించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదవాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. బాగా చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే సమాజంలో మంచి గౌరవం లభిస్తుందని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోఉన్న వైద్య సేవలపై ఆరాతీసిశారు. వార్డులలోని రోగులవద్దకు వెళ్లి డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు.అదనపు కలెక్టర్ వెంట తహశీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో మహబూబ్ అలీ,మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్,డాక్టర్ దేవేందర్, ఆర్ఐ రాజేందర్ రెడ్డి ఉన్నారు

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

-సిద్దిపేట సీపీ. డాక్టర్ బి. అనురాధ.



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట జిల్లాలో పదో తరగతి పరీక్షలు జరిగే 79 పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు చేసి, పటిష్ట బందోబస్తు ను ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ. డాక్టర్ బి.అనురాధ తెలిపారు. ఈ నెల 21 నుంచి 04వ తేదీ వరకు 163 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని పరీక్ష సెంటర్లో వద్దనుండి 500 మీటర్ల వరకు ప్రజలు భూమి కూడా వద్దని సూచించారు. విద్యార్థులు పరీక్షా సమయానికే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సీపీ సూచించారు.

23న సిద్దిపేటలో జాబ్ మేళా

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గ నిరుద్యోగ యువతి (మహిళ)ల కోసం ఈ నెల 23న విపంచి కళా నిలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలోని మహిళల కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ క్యూస్ విన్నింగ్ టుగేధర్ వారి సౌజన్యంతో సిద్దిపేటలో నిర్వస్తున్నట్లు చెప్పారు. 18 సం. వయస్సు పై బడిన మహిళలు, అర్హత 10, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ జాబ్ మేళా లో సెలక్షన్ అయిన మహిళలకు 15 రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి జాబ్ లో తీసుకుంటారని చెప్పారు. నియోజకవర్గ పరిసరా ప్రాంతం లోని నిరుద్యోగ యువతి (మహిళలు) లు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441799884, 9848999990, 99898 08022 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నూతన బోరు మోటార్ ప్రారంభం



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని 19వ వార్డులో బుధవారం జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కెడం లింగమూర్తి నూతన బోరు మోటర్‌ను ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో బోర్ మోటార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సావుల రాజయ్య, చిత్తారీ పద్మ , నాయకులు బూరుగు కిస్తస్వామి,,దొబ్బల అనిల్,గడిపే బాలు,కాంగ్రెస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత సాధిస్తే నగదు బహుమతి



నవతెలంగాణ-దుబ్బాక

పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన తమ పాఠశాల విద్యార్థులందరికీ రూ.1000ల నగదు బహుమతిని అందజేస్తానని టీఎస్పీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మ్యాథ్స్ టీచర్ కూరాకుల శ్రీనివాస్ హామీ ఇచ్చారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో జడ్పీహెచ్ఎస్‌లో రిటైర్డ్ టీచర్ ధనుంజయ ప్రత్యేక సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ మెటీరియల్‌ను హెచ్ఎం నీలం శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. ఉపాధ్యాయులు ఇస్మాయిల్, మాడుగుల శ్రీనివాస్, రాజేశం, అమృత్, నర్మద పలువురున్నారు.


కేసీఆర్ కనబడుట లేదు



నవతెలంగాణ-మర్కుక్

మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడుటలేదని మర్కుక్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరగౌని శ్యాంప్రసాద్ గౌడ్ ప్రసాద్ అధ్వర్యంలో బుధవారం మర్కుక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అశోక్, అనిల్ గౌడ్, ఆనంద్, అరవింద్, సిద్దేశ్వర్, జితేందర్ రెడ్డి, తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల మధ్య చిచ్చు



నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల మధ్య చిచ్చు పెడుతోందని తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా కార్యవర్గ సభ్యులు కాల్వ నరేష్, దుబ్బాక అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కాల్వ లింగం అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం దుబ్బాకలోని అంబేద్కర్ విగ్రహ చౌరస్తా వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మాలల పట్ల వివక్ష చూపితే సహించబోమని హెచ్చరించారు. ఈ నిరసనలో దుబ్బాక అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి మండలం కేంద్రంలోని బీరప్ప దేవాలయం వద్ద చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక మాజీ సర్పంచ్ ఐలం శివ, మాజీ ఎంపీటీసీ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.పది లక్షలు నిధులు మంజూరు చేయించిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు దోమకొండ నర్సారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

-విద్యాశాఖ అధికారి రచ్చ కిష్టయ్య



నవతెలంగాణ-చేర్యాల

రేపటి నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యా శాఖ అధికారి రచ్చ కిష్టయ్య తెలిపారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో బుదవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 760 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని,ఇందులో 16 ప్రభుత్వ పాఠశాలలో చదివే 519 మంది,7 ప్రైవేటు పాఠశాలల్లో చదివే 241 విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.మండల కేంద్రంలోని బాలికల పాఠశాల, పెద్దమ్మగడ్డ,సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పాటు ముస్త్యాల మోడల్ హై స్కూల్ లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్: నర్సింహారెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని విద్యారంగానికి అరకొర నిధులను కేటాయించడం బాధాకరమని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అమ్మన నర్సింహారెడ్డి అన్నారు.బుధవారం దుబ్బాకలో ఆయిన మాట్లాడుతూ, విద్యకు నిధుల కేటాయింపు పెంపును ప్రభుత్వం విస్మరించిందని, దీంతో ప్రభుత్వ విద్యా సంస్థలు నిధుల లేమితో కునారిల్లుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి బడ్జెట్ లో విద్యారంగానికి భారీ మొత్తంలో నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్ బుధవారం పంపిణీ చేశాడు. గ్రామానికి చెందిన చైతన్యకు రూ.27వేలు, సుధాకర్‌కు రూ.21వేలు, వెంకటయ్యకు 18వేలు, నరసింహులుకు 27వేల చెక్కులు మంజూరయ్యాయి. వాటిని పంపిణీ చేశారు.



ఇచ్చిన హామీలకు..బడ్జెట్‌కు పొంతన లేదు

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఏ మాత్రం పొంతనలేదని, ఈ ఏడాది కూడా ఇచ్చిన హామీలను అమలు చేసేటట్లు లేదని బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే అర్థమవుతుందని ఇది ప్రజలను మోసం చేయడమేనని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో రూ.3,04,965 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ గత ఏడాది బడ్జెట్ కంటే 13,906 కోట్లు పెంచినా ఈ బడ్జెట్ పేదలకు ప్రజలకు ఏమాత్రం ఊరట నిచ్చే విధంగా సమస్యల నుంచి ప్రజల్ని గట్టెక్కించే విధంగా లేదన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కేటాయింపులు సరిగ్గా చేయలేదని 40 లక్షల మంది పైగా ఇండ్లు లేని నిరుపేదలు ఉంటే కనీసం నాలుగున్నర లక్షల మందికి కూడా కేటాయింపులు సరిగ్గా చేయలేదని అంటే పేదవాడికి ఇండ్లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. విద్య వైద్యానికి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేదిగా ఈ బడ్జెట్ ఉందని, ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా మారుస్తామని అనేక హామీలు ఇచ్చి బడ్జెట్లో విస్మరించారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు సక్రమంగా లేవని, వ్యవసాయ కార్మికులకు ఎస్సీ, ఎస్టీలకు రూ.12వేలు ఇస్తామని చెప్పారని బడ్జెట్లో దానికి అనుగుణంగా కేటాయింపు లేవన్నారు. వ్యవసాయ కూలీల సంఖ్య కనుగుణంగా చేయలేదని, ప్రతి మహిళకు నెలకు రూ.2500లు ఇస్తానని అకౌంట్లో వేస్తామని చెప్పి బడ్జెట్లో మొండి చేయి చూపించారని మొత్తం బడ్జెట్ ఈ సంవత్సరం కూడా కాలయాపన చేసే ప్రజలని మోసగించేదిగా ఉంది తప్ప ప్రజల ప్రయోజనాల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం బడ్జెట్ రూపొందించినట్లుగా లేదని ఈ బడ్జెట్ ను పున్హ సమీక్ష చేసి పేదలు కష్టజీవులు రైతులు కూలీలు శ్రామిక ప్రజలకు అనుకూలంగా ప్రజా సంక్షేమం ప్రధాన ధ్యేయంగా బడ్జెట్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని అన్నారు.

బడ్జెట్ వాస్తవాలను ప్రతిబింబించే బడ్జెట్

-సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్



బడ్జెట్‌లో రూ.3,04,965 కోట్లు కేటాయించిప్పటికి అందులో విద్య రంగానికి 7.57శాతం, వైద్య రంగానికి 6శాతం నిధులను కేటాయించడం వల్ల విద్యారంగం, వైద్య రంగం అభివృద్ధి చెందే అవకాశం లేదని, ఎక్కువ ప్రాధాన్యత ఈ రెండు రంగాలకు ఇస్తే భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో ఉండేదని, గతంలో బిఆరెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్ కేవలం కాగితాల్లో అధికంగా చూపించిన వినియోగం లో మాత్రం శూన్యము అని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్ వాస్తవాలను ప్రతిబింబించే బడ్జెట్ అని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు.. బుధవారం బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ శాఖ రూ.24,439 కోట్లు,పశు సంవర్ధక శాఖ కు రూ.1,674 కోట్లు. పౌరసరఫరాల శాఖ కు రూ.5,734 కోట్లు కేటాయించిదని అవి ఆ రంగాలకు సరిపోవని అన్నారు. మహిళా, శిశు సంక్షేమానికి రూ.2,862 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు, ఎస్టి సంక్షేమానికి రూ.17,169 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.11,405 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ.3,591 కోట్లు, ఐటీ శాఖకు రూ.7,74 కోట్లు. విద్యుత్ శాఖకు రూ.21,221 కోట్లు కేటాయించిన ప్రభుత్వం గతంలో కంటే కొంచెం ఈ శాఖలకు పెంచడం సంతోషం అని, నీటి పారుదుల శాఖకు రూ.23,373 కోట్లు కేటాయింపు, రోడ్లు భవనాల శాఖకు 5,907 కోట్లు కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని మొత్తంగా గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ కేవలం 10వేల కోట్లు మాత్రమే పెంచారని,ఏదేమైనా ఈ బడ్జెట్ పూర్తిగా వినియోగించి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి దిశగా ప్రయాణం చేయాలని,ప్రజల మీద ఆర్థిక భారం మోపకుండా చూడాలని ఆయన అన్నారు.

బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి పెద్దపీట

- ఆరు గ్యారెంటీలకు రూ.56084 కోట్లు కేటాయింపు
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పేదల దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాలు లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ. 56084 కోట్లు ఆరు గ్యారంటీలకు కేటాయించినట్లు స్పష్టం చేశారు. బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ నీటిపారుదల రంగానికి రూ.23373 కోట్లు, వ్యవసాయంకు రూ.24439 కోట్లు వర్తింపచేస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమానికి రూ.11405 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.40232, ఎస్టి సంక్షేమానికి రూ.17 169 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3591 కోట్లు, చేనేత రూ.371 కోట్లు కేటాయించడంతోపాటు పాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, పశు సంవర్ధక శాఖలకు ప్రాముఖ్యత కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా రైతుల నుంచి సన్నధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, మహిళ సంక్షేమం, కార్మిక, పర్యాటక, గృహజ్యోతి పథకాలతో పాటు బియ్యం రాయితీకి రూ.3 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ.600 కోట్లు కేటాయించగా, యువత, విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో యంగ్ ఇండియా, రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ 2900 కోట్లు కేటాయించి సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు వివరించారు.

దోపిడీ లేని సమాజం కోసం పోరాడుదాం..

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-గజ్వేల్

స్వతంత్ర పోరాట యోధురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీర వనిత మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం దోపిడీ లేని సమాజం కోసం పోరాటం చేయాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంద బోయిన ఎల్లయ్య అన్నారు. సీపీఐ(ఎం) కార్యాలయంలో మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి వారు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం ఉన్నత భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సామాన్య బడుగు బలహీన వర్గాల కోసం కష్టనష్టాలకు ఓర్చుకొని పనిచేశారన్నారు. తెలంగాణ ప్రాంతంలో సామాన్య ప్రజలు, దళితులు, వృత్తిదారులపై నైజాం, జాగిర్దారులు జమీందారులు, రజాకార్ సైన్యం సాగించిన ఆగడాలు, చేసిన అరాచక చర్యలకు, మహిళలపై జరిగిన అత్యాచారాలు హింసకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించారన్నారు. స్వాతంత్ర్యానంతరం తుంగతుర్తి నుంచి అసెంబ్లీకి ఎన్నికై ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించిందన్నారు. ఆమె కుటుంబం మొత్తం నేడు ప్రజా ఉద్యమాలకు అంకితం కావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు అహ్మద్, శేఖర్ ప్రవీణ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మద్దూరు

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జనగామ కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ కులగణన ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామడుగు బాలరాజు, దాసరి పద్మా రెడ్డి, ఇట్ట బోయిన కనక చంద్రం, పుల్లూరి రాజు గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట పిల్లలను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

తల్లి తండ్రుల అకాల మరణంతో అనాధలుగా మారిన పిల్లలకు అండగా నిలుస్తామని సొసైటీ చైర్మెన్ కే.హరికృష్ణా రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డిలు భరోసా ఇచ్చారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కెమ్మసారం నాగరాజు, భాగ్యల పిల్లలను బుధవారం వారు పరామర్శించారు. అనంతరం పిల్లలకు కే.హరికృష్ణా రెడ్డి రూ.10 వేలు, జీడిపల్లి రాంరెడ్డి రూ.5 వేలు, మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి రూ.5 వేలు, సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి రూ.5 వేలు, సిద్దిపేటకు చెందిన వీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆదివారం భార్య, భర్తలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. భార్యభర్తల అకాల మరణంతో నలుగురు పిల్లలు మీనాక్షి, మహేష్, లక్కీ, శ్రవన్ అనాధలయ్యారన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు చిన్నారులను పరామర్శించామన్నారు. కరువు కాటకాలు ఏర్పడటంతో ప్రజలకు ఉపాధి కరువు వలన విపత్కార పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నందారం వెంకట్ గౌడ్, కుమార్, ప్రభా కర్ రెడ్డి, కిషన్, రాకేష్, బండారు స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ సరిహద్దు పాయింట్ల పరిశీలన

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి నక్ష (జాతీయ జియోస్పేషియల్ నాలెడ్జ్ ఆధారిత పట్టణ నివాస భూ సర్వే) ప్రాజెక్టులో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా సంస్థ బుధవారం హుస్నాబాద్ మున్సిపాలిటీ సరిహద్దు పాయింట్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దేశంలోని 152 మున్సిపాలిటీల్లో ఈ ప్రాజెక్టులో హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎంపిక అయినట్లు పేర్కొన్నారు. గత నెల క్రితం హెలికాప్టర్‌తో ఏరియల్ సర్వే కూడా చేసినట్లు తెలిపారు. ఈ నక్ష ప్రాజెక్టు ద్వారా మున్సిపాలిటీ జియో మ్యాపింగ్ తయారు చేయబడుతుందన్నారు, ల్యాండ్ రికార్డ్స్, పట్టణము యొక్క అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. పట్టణ భూ రికార్డులకు సంబంధించి సమగ్రమైన జియో స్పేషియల్ డాటా బేస్ ను తయారు చేయబడుతుందన్నారు. ఆస్తి లావాదేవీలు సులభతరం అవుతాయన్నారు. మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవడానికి ఈ నక్ష ప్రాజెక్టు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్, సర్వే అధికారులు పాల్గొన్నారు.



కార్మిక, ఉద్యోగులకు ఊరటనివ్వని రాష్ట్ర బడ్జెట్

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర బడ్జెట్ రూ.3,04,965 కోట్లు ఉండగా, గత సంవత్సరంతో పోలిస్తే రూ.13,806 కోట్లు పెంచినా ఈ బడ్జెట్‌లో కార్మికులు, ఉద్యోగుల వేతనాలు, సంక్షేమం గురించి ఎటువంటి ప్రస్తావన లేదని, కార్మిక ఉద్యోగులకు ఉరాటనివ్వని బడ్జెట్ అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో 22.5 శాతం, సర్వీసు రంగంలో 34.8 శాతం మంది పని చేస్తున్నారని, బడ్జెట్లో కార్మిక శాఖకు రూ.900 కోట్లు నామమాత్రంగా కేటాయించారని అన్నారు. 1 కోటి 50 లక్షల మంది ఉన్న కార్మికులకు ఈ కేటాయింపులు ఏ మూలకూ సరిపోవని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయితీ, మున్సిపల్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ తదితర శాఖల వేతనాల పెంపు గురించి, వారి ఉ ద్యోగాల రెగ్యులరైజేషన్ గురించిన ఊసే లేదని అన్నారు. ఉద్యోగ నియామకాలకు, ఉద్యోగ కల్పనకు ఎటువంటి విధానాన్ని చేపట్టబోతున్నారో ఎక్కడా చెప్పలేదని, లక్షల సంఖ్యలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, టైంస్కేల్, డైలీవేజ్ తదితర ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి కానీ, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన డిఎ బకాయిల గురించి కానీ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎదురుచూస్తున్న పీఆర్సి గురించి, నామమాత్రంగా కూడా మాట్లాడలేదని అన్నారు. లక్షలాది మంది పారిశ్రామిక, అసంఘటితరంగ కార్మికులు కనీస వేతనాల జీఓలు సవరించాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో కార్మికుల సంక్షేమం కోసం పెట్టిన అంశాలు ఈ బడ్జెట్లో లేవని, బీడీ కార్మికులకు చేయూత, జీవిత బీమా, ఈఎస్ఐ, అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, దీనికి బడ్జెట్లో కేటాయింపులు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, స్విగ్గి, జొమాటో కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ రాజస్థాన్ తరహా చట్టాన్ని తెస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విషయం మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ కార్మికులకు ఊరట నివ్వలేదని అన్నారు.

అరకొర నిధుల కేటాయింపులతో విద్యను మెరుగు పరచలేము

- టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ బడుల వసతుల కల్పనలో జాతీయస్థాయిలో 36 రాష్ట్రాల్లో తెలంగాణ 32వ స్థానంలో ఉండగా, నాణ్యమైన విద్య సమర్థంగా బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉందని, అరకొర నిధుల కేటాయింపులతో విద్యను మెరుగుపరచలేమని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్‌లో విద్యకు సరైన నిధుల కేటాయింపులేదని, గత ఏడాది కేటాయింపు రూ.21,292 కోట్లు ఉండగా, ఈ ఏడాది 0.26 శాతం నిధుల కేటాయింపు అధికంగా ఉందన్నారు. ఇది మొత్తం బడ్జెట్ రూ.3,04,965 కోట్లలో విద్యకు రూ.23,108 కోట్ల రూపాయలు (7.57 శాతం నిధులు) ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి ఏ మాత్రం సరిపోవని అన్నారు. గత ఏడాది కన్నా బడ్జెట్ పరిమాణం రూ.1816 కోట్లు మాత్రమే పెరిగినట్లు కనిపించినా, పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణానికి సరిపోతుందన్నారు. ఉప ముఖ్య మంత్రి తన ప్రసంగంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి గొప్పగా చెప్పారని, కానీ 18,259 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 4843 ఉన్నత పాఠశాలల గురించి ప్రస్తావన లేదన్నారు. అవి నిధుల లేమితో కునారిల్లుతాయని, 662 గురుకులాలు స్వంత భవనాలు లేవని ప్రసంగంలో ప్రస్తావించిన మంత్రి భవనాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదన్నారు. బడ్జెట్లో విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత కొరవడిందన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులోని రామాలయం వద్దకు రాజీవ్ రహదారి నుంచి చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు బుధవారం శంకుస్థాపన చేశారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ చేపడుతున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ రెడ్డి,రాష్ట్ర నాయకుడ సొల్లు అజయ్ వర్మ జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి అనిల్ రావు, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వరుణ్ రావు, మండల నాయకులు సుధీర్ రావు, సంఘ రవి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-రాయపోల్

గ్రామాలలో మౌలిక వసతులు, అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధి కోసం మెదక్ ఎంపీ సహకారంతో బుధవారం సీసీ రోడ్లు ప్రారంభించామని రాయపోల్ బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు రాజాగారి రాజా గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని ప్రజలకు సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎంపీ స్పందించి వడ్డేపల్లి గ్రామానికి 10 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కావున రఘునందన్ రావుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయి, వేణు, చందు, వీరేష్, రాజు, బాలరాజ్, యాదగిరి, చింటూ, శ్రీకాంత్, మహేష్, గణేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణ



నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని కొట్యాల్ గ్రామంలోని గొల్ల మత్తడి కుంట చెరువు వద్ద బుధవారం చేపలు పట్టేందుకు కొంతమంది వ్యక్తులు అక్కడికి వెళ్లడంతో అదే గ్రామానికి చెందిన వేరే వర్గం కొంతమంది వ్యక్తులతో చేపలు పట్టేవాళ్ళు దుర్భాషలాడడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకున్న మూలుగు ఎస్సై విజయకుమార్ సిబ్బంది ఇరు వర్గాలకు నచ్చ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. సంబంధిత ఇరిగేషన్ డిపార్ట్మెంట్, మత్స్యకారుల డిపార్ట్మెంట్ లను సంప్రదించి ఈ చెరువుపై ఎవరికి హక్కులు ఉంటే వారికే ఇస్తామని ఒకవేళ ఈ చెరువు ప్రభుత్వ రికార్డులో నమోదు కానట్లయితే ఎవరు కూడా చేపలు పట్టడానికి అర్హులు కాదని హెచ్చరికలు జారీ చేశారు. మరోసారి చెరువు వద్ద ఎలాంటి ఘర్షణలు నెలకొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డు

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులను డీఎం వెంకటేశ్వర్లు అందజేశారు. జనవరి, ఫిబ్రవరి 2025లో ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డ్స్, ఉత్తమ ఈపీకే, ఉత్తమ కెఎంపిఎల్ నగదు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌గా వెంకన్న

హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. హుస్నాబాద్‌లో డిపో మేనేజర్ పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీపై కాచిగూడ డిపోకి వెళ్లారు.

కేరళ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇమీ హై స్కూల్‌లో బుధవారం యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెరేమోనీ నిర్వహించారు. పాఠశాల చైర్మెన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం 2024-25లో 61 మంది విద్యార్థులు యూకేజీ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్ తల్లిదండ్రుల సమక్షంలో అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ పున్న లావణ్య సదానందం, పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అల్లి శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత గౌరవం

-కొంగర రవి



నవతెలంగాణ-దుబ్బాక

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత గౌరవం కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షులు కొంగర రవి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు బుధవారం దుబ్బాకలోని బస్టాండ్ ఎదుట రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలతో కూడిన ఫ్లెక్సీకి బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి మాట్లాడారు. బీసీలకు 42 శాతం, వర్గీకరణ పేరిట ఎస్సీలకు 20 శాతం విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. బీసీ, ఎస్సీ వర్గీకరణ బిల్లుల్ని పార్లమెంట్ లో బీజేపీ ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, ఆకుల భరత్, చెక్కపల్లి పద్మయ్య, చంద్రం పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేద యువతకు 'రాజీవ్ యువ వికాస్'ను వర్తింప చేయాలి



-రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-దౌల్తాబాద్

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు కూడా వర్తింపచేయాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు అవకాశం కల్పించకపోవడంతో తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారు. అగ్రవర్ణ కులాల్లో పుట్టిన ప్రతి ఒక్కరు ధనవంతులు కారని అందులో ఉన్న పేద, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేదంటే అగ్రవర్ణ పేద కులాల్లోని నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో వారిని కూడా భాగస్వామ్యులు చేస్తూ ఆ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అగ్రవర్ణ కులాల్లోని నిరుద్యోగ యువతను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఆత్మ రాములును సన్మానించిన యూత్ కాంగ్రెస్

నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్దిపేట జిల్లా అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సాదుల ఆత్మ రాములును యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ, ఎన్ఎస్‌యూఐ టౌన్ ప్రెసిడెంట్ ప్రతాప్, నియోజకవర్గ ఇంచార్జి రాకేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు నవాజ్, సోషల్ మీడియా నాయకులు అరవింద్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుచాలి











నవతెలంగాణ-దౌల్తాబాద్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం రాంసాగర్ పాఠశాల వార్షిక దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాంసాగర్ గ్రామానికి చెందిన కాస కృష్ణ, దండు జగన్ ఇద్దరు యువకులు పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి కూడా ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. వార్షికోత్సవ దినోత్సవ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పదో తరగతి విద్యార్థులు సమ యాన్ని వృధా చేయకుండా అన్ని సబ్జెక్టులు పూర్తిగా చదవాలన్నారు. కాస కృష్ణ, దండు జగన్‌లకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, సిఆర్పి స్వామి గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలను సాధించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గుడికందుల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి, మానసిక ధైర్యం కలిగి ఉండి, ఎలాంటి గాబరాకు గురి కాకుండా ప్రణాళిక బద్ధంగా అధ్యయనం చేయాలన్నారు. పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాల ని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లను పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్స్, పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ఉపా ధ్యాయులు ఎస్. నాగి రెడ్డి, వేణుమాధవ్, కనక రాములు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని తునికి, బొల్లారం, కస్తూర్బా గాంధీ పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా సామాగ్రి పుల్లబోయిన అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, తునికి బొల్లారం గ్రామస్తుడు మల్లేష్, తదితరులున్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం జాలిగామ జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం గజ్వేల్ బీజేపి యువ నాయకులు సురేష్ తన సొంత డబ్బులతో పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్న ఆలోచనలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల నర్సింలు గౌడ్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

పదో తరగతి విద్యార్థులు అందరూ పరీక్షల్లో శత శాతం ఉతీర్ణత సాధించాలని లయన్ సూర్యరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుచున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు ,పెన్నులను, హాల్ టికెట్లను అందజేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో నెలకొల్పిన సరస్వతి మాత పూజలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్ సూర్య రాజు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించి వారి ఉన్నత విద్యను కొనసాగించాలని భవిష్యత్తులో వారికి తన తోడ్పాటున అందిస్తానని తెలియజేశారు. పదవతరగతి పూర్తయిన తర్వాత త్రిబుల్ ఐటీ, పాలిటెక్నిక్ ,ఐటిఐ లాంటి సాంకేతిక శిక్షణ కళాశాలలో చేరాలని నైపుణ్యాలను అభ్యసించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశం, మర్కుక్ మండల పిఆర్టియు అధ్యక్షులు రేబల్లి శ్రీనివాసరావు , ఉపాధ్యా యులు లయన్ రమణారావు, వందన, తదితరులున్నారు.

బడ్జెట్‌లో విద్యాశాఖకు మొండిచేయ్యి



టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గ్యార ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-కొమురవెల్లి

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బడ్జెట్లో విద్యాశాఖకు మొండి చేయి చూపించిందని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గ్యార ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపు పై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం రూ 304,965 కోట్ల బడ్జెట్లో విద్యకు కేటాయించింది రూ 23108 కోట్లని 7.57% శాతం, గత సంవత్సరం రూ 274058 కోట్ల బడ్జెట్ లో విద్యకు కేటాయించింది రూ 21292 కోట్లని 7.77 శాతం,అంకెల్లో రూ 1816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ శాతాల్లో చూస్తే గత సంవత్సరం కంటే తగ్గిందని తెలిపారు. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26067 పాఠశాలలను గాలికొదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతున్నదని,గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమేనని తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే 16 లక్షల మంది విద్యార్థుల్లో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారేనన్నారు. వీరికి నాణ్యమైన విద్య అందించడానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవన్నారు.విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, మెరుగైనమధ్యాహ్నభోజనం అందించేందుకు, నాణ్యమైన విద్యను అందించడానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యకు 15% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పిల్లలు అనాధలవటం బాధాకరం

-కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట : నలుగురు పిల్లలు అనాధలవటం చాలా బాధాకరమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో 4 గురు పిల్లలను అనాధలను కావడం ఎంతో బాధ కలిగించిందన్నారు. ఎన్ని అప్పులు ఉన్న క్షణికావేషంతో ఆత్మహత్య చేసుకొని పిల్లలను ఒంటరి చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. దయజేసి ఎవరైనా సరే పిల్ల లను దృష్టిలో పెట్టుకొని కష్టాలను ఎదురుకొని ముందుకు సాగాలని సూచించారు. పిల్లలకు, వాళ్ళ కుటుంబానికి ప్రభుత్వం తరుపున డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, పిల్లల చదువులపై ఎప్పటికి అప్పుడు అండగా నిలిస్తానని ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలాకి ఆర్థిక సాయం, బియ్యం అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన జుట్టు లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ పాండు గౌడ్ బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ల మహేష్,జుట్టు సుధాకర్,అంబదాస్ గౌడ్,బోయిని మల్లేష్,మ్యాకల శ్రీనివాస్, అంజి,బాలస్వామి ,తదితరులున్నారు.

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మన్నే వెంకటయ్య (52) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, తాడేం గణేష్, కొట్టాల మహేష్, తదితరులున్నారు.



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్, వాసవి క్లబ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో యాద శ్రీనివాస్ వాసవి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆర్థిక సాయంతో 10 మంది నిరుపేదలకు 10 కిలోల చొప్పున బియ్యం వైశ్య భవన్‌లో అందించినట్లు డీఎస్ఓ చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ.. మా సభ్యుల సహాయ సహకారాలతో కులమతాలకు అతీతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మెన్ చకిలం రవి, వాసవి క్లబ్ అధ్యక్షులు మురంశెట్టి కుమార్, ఎర్రం శివశంకర్, ప్రధాన కార్యదర్శి చిగులపల్లి సత్యనారాయణ, పుల్లూరి మహేష్, కోశాధికారి బెజగామా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గేట్ ఫలితాల్లో శ్రవణ్ రెడ్డికి 807వ ర్యాంకు

నవతెలంగాణ-సిద్ధిపేట



చిన్నకోడూరు మండల పరిధిలోని మాచపుర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రవణ్ రెడ్డి గేట్ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా లో 807వ ర్యాంకు సాధించాడు. బుధవారం వెలువడిన ఫలితాల్లో మంచి ర్యాంకు రావడంతో శ్రవణ్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నాపై అక్రమ కేసులు పెట్టడం బాధాకరం

-టీఎస్24 న్యూస్ ఛానల్ చైర్మెన్ ఆకుల శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-సిద్ధిపేట



టీఎస్ 24 ఛానల్ ద్వారా గత కొద్దిరోజులుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న తప్పులను, అక్రమాలను, మోసాలను తాను వాడిన భాషలో ప్రశ్నిస్తున్నందుకు కాంగ్రెస్ రాజ్యం నాపై అక్రమ కేసులు పెట్టించడం జరిగిందని ఛానల్ చైర్మెన్ ఆకుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నిన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ తన అనుచరులతో కులాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వం సహాయంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేపించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మంత్రి ఇలా నాపై అక్రమ కేసు పెట్టించడం ముమ్మాటికి దారుణం అన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం దారుణం అన్నారు. కాంగ్రెస్ నాయకులు నన్ను చంపే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పదుల సంఖ్యలో జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టించిన రేవంత్ సర్కార్ ను జనం అసహ్యించుకుంటున్నారని అన్నారు.

సమాజంలో స్త్రీల పాత్ర ఎనలేనిది



నవతెలంగాణ-దౌల్తాబాద్

సమాజంలో మహిళల పాత్ర గొప్పదని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రం ఏఆర్ గార్డెన్ లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. స్త్రీ లేకపోతే జననం, గమనం, సృష్టే లేదన్నారు. మహిళలు చైతన్యవంతం కావాలంటే తప్పనిసరిగా అందరూ చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సామ్రాజ్యలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచం సుష్మ, మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, మండల అధ్యక్షులు గంప రవి, పబ్బ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రాజీనామా చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు జస్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు వాంటెడ్ ఎమ్మెల్యే బోర్డును అతికించి నిరసన తెలిపారు. నియోజకవర్గ నాయకులు బండారి మహేష్ అధ్యక్షతన గజ్వేల్ పట్టణ కేంద్రంలో గల మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బీజేపీ నాయకుల వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జస్వంత్ రెడ్డి, మహేష్‌లు మాట్లాడుతూ.. 119 నియోజకవర్గాల్లో అనాథ నియోజకవర్గం ఏదైనా ఉందా అంటే అది గజ్వేల్ నియోజకవర్గం మాత్రమే అన్నారు. అప్పుడంటే ముఖ్యమంత్రి కాబట్టి తెలంగాణను బంగారు తెలంగాణ రాష్ట్రంగా మార్చే పనిలో ఉన్నారని సమయం దొరకలేదు అనుకున్నామన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉండి అసెంబ్లీలో సైతం మా గొంతు గా మా సమస్యలు వినిపించ లేదన్నారు. చేతకాకపోతే రాజీనామా చెయ్యి నాలాంటి నిరుద్యోగులు మేధావులు సమాజ సేవకులు చాలామంది ఉన్నారు. గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోవాలని చెప్పేసి చేతకాకపోతే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, వెంకటరెడ్డి, దేవేందర్, జిల్లా నాయకులు కోదండమ్, శ్రీనివాస్ రెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పట్ల హర్షం









నవతెలంగాణ-దుబ్బాక

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దుబ్బాకలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఇస్తారిగల్ల ఎల్లం మాదిగ, జనగామ నవీన్, జనగామ విజయ్,చెక్కపల్లి మహేష్,డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు చెక్కపల్లి రాజమల్లు,కట్కూరి రామచంద్రం పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేసిన గజ్వేల్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల రణం ఈ వర్గీకరణ ప్రజాపాలనలో చరిత్రక నిర్ణయం నేటితో శాశ్వత పరిష్కారం జరిగిందన్నారు. ఎన్నో ఏండ్ల కల ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలపడం పట్ల మంత్రివర్గానికి, సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ-మర్కుక్: పద్మశ్రీ మందకృష్ణ మాదిగగారి 30 ఏళ్ల పోరాటం పలితంగ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆ మోదించారు. శాసనసభలో ఎస్సి వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగ ఆమోదించిన సందర్భంగా మర్కుక్ మండల కేంద్రమైన మర్కుక్‌లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆద్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం టపాకాయలు కాల్చి స్వీట్లుపంచుకుని విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మొండి రమేష్ మాదిగ, గౌరవ సలహాదారు కర్రోళ్ల నర్సింలు మాదిగ, మొండి బిక్షపతి , ప్రధకార్యదర్శి బక్కల శరత్ బాబు మాదిగ, ఉపాధ్యక్షులు మరిగళ్ల ప్రసాద్ మాదిగ, కార్యదర్శి మొండి స్వామి ,సతయ్య శ్రీకాంత్,ప్రవీణ్, అశోక్, సత్యం, బాబు,నత్తి శీను, చంద్రం, తదితరులున్నారు.

నవతెలంగాణ జగదేవపూర్: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని అదేవిధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు బుధవారం జగదేవ పూర్ మండల కేంద్రంలో గల అంబెద్కర్ చౌరస్తాలో కార్యక్రమం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పోసాన్ పల్లి రాజు, జేఏసీ అధ్యక్షుడు మాసపాక యాదగిరి నిర్వహించారు. ముఖ్యాతిథులు గా ఎమ్ జే ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంజేఫ్ జిల్లా అధ్యక్షులు గుర్జకుంట రామస్వామి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాలొగొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్యామ్ కిరణ్ మాదిగ మాట్లాడ ఎతూ.. భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ ఆదేశాలకు కట్టుబడి ఉండి పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి అక్కన్నపేట మండల అధ్యక్షుడు జన్నె రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి జల సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బెజ్జంకి సారయ్య, సుంచు ప్రవీణ్ రాయకుండా మహేష్ రైకుంట బాబు, రమేష్, వినయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలసీలపై జీఎస్టీని తొలగించి బోనస్ పెంచాలి

- **హుస్నాబాద్ బ్రాంచ్ లియాఫీ ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి**

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



భారతీయ జీవిత బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని పూర్తిగా తొలగించి పాలసీదారులకు బోనస్ రేటు పెంచాలని హుస్నాబాద్ బ్రాంచ్ లియాఫీ ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి డిమాండ్ చేశారు. బుధవారం భారతీయ జీవిత బీమా పాలసీదారులపై విధిస్తున్న జీఎస్టీని తొలగించి జీవిత బీమా సంస్థలో ఏజెంట్లుగా పనిచేస్తున్న ఏజెంట్ల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరుగుతున్న శాంతియుత నిరసనకు మద్దతుగా హుస్నాబాద్ లియాఫీ ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి నేతృత్వంలో పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం ముందు బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ నాయకులు మాట్లాడుతూ.. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఇన్సూరెన్స్ రంగంలో ప్రజల మన్ననలు పొంది దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఎల్ఐసి సంస్థను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేయడంలో ఏజెంట్ల పాత్ర మరువలేనిదని అన్నారు. ఏజెంట్ల న్యాయమైన కోరికలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు అన్నాడి మల్లారెడ్డి, వెల్దండి రాజేంద్రప్రసాద్,కక్కర్ల మల్లికార్జున్ గౌడ్, జాగిరి రాజు, వెల్దండి మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

ఏండ్ల నిరీక్షనకు శాశ్వత పరిష్కారం

-కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి

నవతెలంగాణ-తొగుట

ఏళ్లుగా నిరీక్షిస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేన ప్రభుత్వానికి కృతజ్ఞతలులని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం టీపీసీసీ పిలుపుమే రకు అసెంబ్లీ లో బీసీ బిల్లు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, చేరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమం లో మాజీ ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాగల కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు కొంగరి నర్సిములు, బెజ్జనబోయిన అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనతో బీసీ కులాలకు ఎంతో మేలు

-కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో-కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే బీసీ కులగణన చేపట్టి అసెంబ్లీ ఆమోదం తెలపడం ద్వారా బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన బీసీ సబ్ ప్లాన్, ఎస్సీ సబ్ ప్లాన్ అమలు తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు ప్రక్రియను చూసి తట్టుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు రైతు సంక్షేమాన్ని మరిచిన బీఆర్ఎస్ ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పి.ప్రదీపురెడ్డి, కె రాజిరెడ్డి, చంద్రశేఖర్, సురేందరరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ అల్లరి మూకల భరతం పడతాం

-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్, బీజేపీ అల్లరి ముకాల భరతం పడతామని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే ఒక శక్తి అని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంపు గేటు దాగితే కాంగ్రెస్, బీజేపీ నాయకుల సంగతి చూస్తామన్నారు. సుమారు 12 ఏండ్లుగా పరిపాలన చేస్తున్న మోడీ ఉమ్మడి జిల్లాకు ఏమిచ్చారని ప్రశ్నించారు. పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన రఘునందన్ రావు గజ్వేల్ ప్రాంతానికి ఎన్ని కోట్లు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే మోడీ, రఘునందన్ రావు ఇంటిముందు ధర్నా చేయాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశం లో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ వైస్ చైర్మెన్ జకీర్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలకు రైతులను బలి చేస్తున్నారు

నవతెలంగాణ-బెజ్జంకి



ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసి పంట చేతికచ్చే సమయంలో సాగు చేసిన సాగు నీరందక పంటలు ఎండిపోతుంటే అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు రైతులను బలి చేస్తున్నారని మండలంలోని గుండారం గ్రామంలో బీజేపీ నాయకుడు సాన వేణు బుధవారం అగ్రహం వ్యక్తం చేశారు.రంగనాయక సాగర్ నుండి గుండారం వరకు శాశ్వత సాగు కాల్వ సమస్యకు పరిష్కారం చూపాలని లేనిపక్షంలో గుండారం గ్రామంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని అధికార, ప్రతిపక్ష పార్టీలకు సాన వేణు హెచ్చరించారు. తక్షణమే పంటలు ఎండిన రైతులకు ఎకరాకు రూ.45 వేలు ప్రభుత్వం పరిహారమందజేయాలని బీజేపీ పార్టీ పక్షాన వేణు డిమాండ్ చేశారు.రైతులు ఎలుకంటి శ్రీనివాస్ రెడ్డి,గుర్రాల జితేందర్ రెడ్డి,ఎలుక శ్రీశైలం,కోరుకొప్పుల యాదయ్య, సాన బాగయ్యకంది రాజు,బొప్పెన కుంటయ్య, నరిగే బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతానం కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్ద మండలంలోని కారస్ గుత్తి గ్రామానికి చెందిన మల్లప్ప కూతురు ప్రతానం వేడుక బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి డీసీసీ ప్రధాన కార్యదర్శిచంద్రశేఖర్ రెడ్డి హాజరై.. నూతన వధువును ఆశీర్వదిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో మండలయువజన కాంగ్రెస్అధ్యక్షులు సచిన్‌పాటిల్,నాయకులు అంబ్రిష్ తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసం..

వాహనంలో ఇసుక బస్తాలు వేసి.. వేబిల్‌పై తూకం

నవతెలంగాణ-వట్‌పల్లి

రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేసిన ఓ వ్యాపారి.. ఆ పత్తిని మిల్లుకు తీసుకుపోయే ముందు తన డీసీఎం వాహనంలో ఇసుక బస్తాలను పెట్టి వేబిల్‌పై తూకం వేయిం చాడు. అనంతరం రైతుల వద్ద నుంచి పత్తిని సేకరించడానికి వెళ్లగా.. రైతులు ఇసుక బస్తాలను గుర్తించి నిలదీశారు. ఈ ఘటన మండలంలోని దరఖాస్తుపల్లిలో బుధవారం జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం..

దరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలోని హసన్ అనే వ్యాపారికి పత్తిని విక్రయించాడు. గ్రామంలోని పత్తిని మిల్లుకు తీసుకెళ్లడానికి డీసీఎం వాహనా న్ని వ్యాపారి పంపించాడు. అయితే వట్‌పల్లిలోని ఓ వేబిల్ వద్ద వాహనంలో రెండు ఇసుక బస్తాలను ఉంచి కాంటా వేయించారు. అనంతరం దరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన రైతు నాగయ్య వద్దకు పత్తిని తీసుకుపోయేందుకు వాహనం వెళ్లింది. ఈ క్రమంలో డీసీఎంలోని ఇసుక బస్తాలను స్థానికంగా ఉన్న కొందరు రైతులు గుర్తు పట్టారు. ఇసుక బస్తాలతో వేబిల్ ఎలా వేస్తారని ప్రశ్నించారు. వాహనం 10 టన్నులు మాత్రమే ఉండగా ఇసుక బస్తాలతో తూకం వేయడంతో.. పది టన్నుల మూడు క్వింటాళ్ల బరువు ఉంటుందని చెబుతూ.. ఆ మూడు క్వింటాళ్ల డబ్బులను అక్రమంగా కాజేస్తున్నారని రైతులు మండిపడ్డారు. రైతుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వ్యాపారితో పాటు వ్యాను ఇసుక బస్తాలను స్టేషన్‌కు తరలిం చారు. అదే గ్రామానికి చెందిన మామిడిపల్లి భూమయ్య నాలుగు రోజుల క్రితం 70 క్వింటాళ్ల నిల్వ విక్రయించగా.. 62 క్వింటాళ్లు మాత్రమే ఉన్నద'ని సదరు వ్యాపారి నమ్మించాడని చెప్పారు. అలాగే మరోక రైతు నరసింహ గౌడకు, మరువెల్లి గ్రామానికి చెందిన భూమన్న పత్తి కొనుగోల్లోనూ ఇలాం టి మోసం జరిగిందని చెప్పారు. దాంతో ఈ వివాదం స్టేషన్‌కు చేరుకో వడంతో పత్తి వ్యాపారి దిగివచ్చి మోసానికి పాల్పడింది నిజమేనని.. చేసిన తప్పును ఒప్పుకొని భూమయ్య అనే రైతుకు రూ.50 వేలు తిరిగి చెల్లిం చాడు. రైతులకు క్షమాపణ కోరడంతో ఎటువంటి ఫిర్యాదు చేయలేకపోయారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్దబోయిన సాయి కుమార్ మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పట్వారి శివశేఖర్ ఆదేశానుసారం బుధవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులకు సంఘం తరపున రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. వారి మృతికి ముదిరాజ్ సంఘం పక్షాన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి తుపాకుల సునీల్ కుమార్, సభ్యులు చాపల వెంకటేశం, సాయిబాబా, ప్రకాష్, యాదగిరి, శేఖర్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మునిపల్లి

మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కంకోల్ శివారులో బుధవారం జరిగింది. ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన నడిమి దొడ్డి పాపయ్యకు మతిస్థిమితం లేదు. దాంతో అతని అల్లుడైన పోల్కంపల్లి గ్రామానికి చెందిన ముత్యాల శివకుమార్ చేరదీసి బాగోగులు చూసుకుంటున్నాడు. అయితే ఈనెల 16న రాత్రి బయటకు వెళ్లిన పాపయ్య తిరిగి ఇంటికి రాలేదు. ఈ క్రమంలో కంకోల్ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి అల్లుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-మునిపల్లి

రేకుల షెడ్ పైనుంచి ప్రమాదవశత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో జరిగింది. ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరికి చెందిన నితీష్ కుమార్(28) కొన్నేండ్లుగా బుదేరా గ్రామ శివారులో గల హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అయితే గత మంగళవారం మధ్యాహ్నం సిమెంటు రేకుల షెడ్డు పైకి ఎక్కి పనిని పరిశీలిస్తుండగా.. ప్రమాదవశత్తు జారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం జరగాలి



నవతెలంగాణ-జోగిపేట

బోగస్ ఓటర్లను ఏరివేయడానికి ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం జరగాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం అందోల్ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విష్ణు సాగర్ అధ్యక్షతన ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, బోగస్ ఓటర్ల తొలగింపు, ఇతర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం జరగాలని, తద్వారా బోగస్, డబుల్ ఓటర్ల తొలగింపు సులువు అవుతుందని సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులందరు ముక్తకంఠంతో కోరారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన వారందరి ఓట్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం), సీపీఐ, బీఎస్పీ ప్రతినిధులు శివరాజ్, లక్ష్మీ కాంత్ రెడ్డి, వెంకటేశం, శివచందర్, విద్యాసాగర్, నర్సింలు, బుచ్చయ్య, నాయబ్ తహశీల్దార్ మధుకర్ రెడ్డి, నాయబ్ తహశీల్దార్ (ఎన్నికలు) చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలంలోని రైతులందరూ ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏడీఏ బిక్షపతి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన ఏఈఓ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరునికి గుర్తింపు ఇచ్చినట్టుగానే ప్రతీ రైతుకు 11 నెంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింద న్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా అందులో సంగారెడ్డి జిల్లాలో మొగుడంపల్లి గ్రామం ఎంపికయిందన్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు తన భూములకు సంబంధించిన వివరాలతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ తయారు చేయబడుతుందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడిని కేటాయిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేస్తారన్నారు. పిఎం కిసాన్ లబ్దిదారుల తదుపరి విడత లబ్ది పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని కేంద్రం మార్గ దర్శకాలు జారీ చేసిందన్నారు. రైతు విశిష్ఠ సంఖ్యను (ఫార్మర్ ఐడి) పొందుటకు ఆధార్ మరియు భూ యాజమాన్య పాస్ పుస్తకం.. ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. భవిష్యత్‌లో పంటల బీమా, పంట రుణాలు, కొనుగోలు కేంద్రాలు తదితర కార్యక్రమాలు అమలు చేయడానికి ఈ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రామాణికం అవుతుందన్నారు. మొగుడంపల్లి గ్రామ రైతులు అందరూ ఈ రిజిస్ట్రీలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు హసునుద్దీన్, వినోద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, భూమేష్, సరస్వతి, ఖనీజ్, ఆత్మ బి.టీ.యం చరణ్ పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు పోరాడుతాం



నవతెలంగాణ-అమీన్‌పూర్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఐద్వా అమీన్‌పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బీరంగూడ భ్రమరాంబిక కాలనీలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీత, నాయిని లలిత మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం పోరాటాలు నిర్వహించాలన్నారు.భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో గ్రామాలు తిరిగి ప్రజలను చైతన్య పరుస్తూ మహిళలను పోరాటాల్లోకి తీసువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, పద్మావతి, మల్లేశ్వరి, లక్ష్మి, లావణ్య,సరస్వతి, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ







నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని డాకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రామ వెన్నెల యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. 70 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. ప్రతీయేడు విద్యార్థులు లాగే ఈసారి కూడా యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించినట్టు చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి బండి కృష్ణ, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఆక్సాన్‌పల్లి పిఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ టీసీ రమేష్‌గౌడ్, మాజీ వార్డ్‌మెంబర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, సతీష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్ : మండల పరిధిలోని రాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మలిదశ ఉద్యమ నేత కాశీ బసవరాజ్ వారి మిత్రబృందం ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి.. మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉపాధ్యాయులు వినోద్, శశికళ, గ్రామ నాయకులు ధనుంజయ్, సాయిలు, శేఖర్, అంగన్వాడీ టీచర్ సమాధానం తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ : మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టీజీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు మర్రి ప్రదీప్ తన సొంత డబ్బులతో బుధవారం పరీక్షా ప్యాడ్‌లను, జ్యామెట్రీ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది అన్నారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు తనవంతుగా సాయం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళాసంఘం గ్రామంలో సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి దామోదర నరసింహ సహకారంతో గ్రామంలో ఐదు లక్షల నిధులతో సీసీరోడ్డ పనులను ప్రారంభించడం హర్షణీయమన్నారు. ప్రతీ మారుమూల గ్రామాలను పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహకు అతనికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాటిపల్లి ప్రదీప్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సంగన్న, గ్రామ సీనియర్ నాయకులు గొల్ల రాసయ్య, పడమటి సంఘన్న, యువకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే గురువులైన వేళ..

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే గురువులై పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, అధ్యాపక బృందం జిన్నారం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కళింగ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

మద్దతు ధరకోసం నేడు పాడి రైతుల ర్యాలీ

నవతెలంగాణ-జహీరాబాద్

పాలకు మద్దతు ధర కోసం జహీరాబాద్ నియోజకవర్గంలోని పాడి రైతులందరూ నేడు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్టు నాయకులు మహిపాల్ రెడ్డి, విష్ణులు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలోఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి..మెమోరాండాన్ని ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు శివకు మార్,మహేష్ కుమార్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గణేష్‌గడ్డ ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలో గల గణేష్‌గడ్డ వద్ద స్వయంభుగా వెలిసిన శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపును నిర్వహించారు. 103 రోజుల హుండీ ఆదాయం రూ.26,98,462, అలాగే అన్నదానం హుండీ ఆదాయం రూ. 1,22,434 మొత్తం ఆదాయం రూ. 28,20,896 వచ్చిందని ఆలయ ఈఓ ఎన్.లావణ్య తెలిపారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పి.విజయ లక్ష్మి, రెవెన్యూ అధికారి కె.సంతోష్ శర్మ సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుండీలో వచ్చిన ఆదాయాన్ని ఆలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్ శర్మ, అజయ్ శర్మ, అయ్యప్ప పంతులు, జగదీశ్ స్వామి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.